సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 03.11.2026


www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 362
పేజీలు: 08 వెల: రూ. 5

ముంచుకొస్తున్న ముప్పు

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

- ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం
- గంటకు 120 కి.మీ వేగంతో బలమైన గాలులు
- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు నిర్వహణ సంస్థ హెచ్చరిక





తెలంగాణపై ఫుల్ ఫోకస్

అమిత్ షా హైదరాబాద్ వ్యూహం గేమ్ ఛేంజర్ అవుతుందా?

లక్ష మందితో అమిత్ షా మెగా పాదయాత్ర.. బీజేపీ భారీ స్కెచ్!

- హైదరాబాద్‌లో కమలనాథుల బలప్రదర్శన.. కాంగ్రెస్‌కు కౌంటర్!
- అమిత్ షా ఎంట్రీతో రాజకీయాల్లో కొత్త హీట్!
- జనసమీకరణే లక్ష్యంగా ఎన్నికలే టార్గెట్!
- గ్రేటర్ ఎన్నికలకు ముందే బీజేపీ పొలిటికల్ షో!

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో పట్టు సాధించేందుకు భారతీయ జనతా పార్టీ మరో సారి భారీ రాజకీయ ప్రదర్శనకు సిద్ధ మైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష మంది జనసమీకరణ పాద యాత్ర ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపుతోంది. 'లోక్‌తంత్ర బచావో–అరాచకత్వ హటావో' నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమం వెనుక కేవలం కాంగ్రెస్‌కు రాజకీయంగా కౌంటర్ ఇవ్వాలనే ఉద్దేశమే ఉందా? లేక రాబోయే ఎన్నికలకు ముందే తెలంగాణలో బీజేపీ బలాన్ని చాటుకునే వ్యూహమా?

కాంగ్రెస్‌కు కౌంటర్.. రాజకీయ పోరుకు కొత్త వేదిక!

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' ర్యాలీకి సమాధానంగా బీజేపీ ఈ పాదయాత్రను తెరపైకి తీసుకొచ్చింది. ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడంతో పాటు, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ పేరుతో రాజకీయ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కమలనాథులు భావిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర మొజంజాహీ మార్కెట్ వరకు కొనసాగనుంది. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఈ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన ఎలాంటి విమర్శలు చేస్తారన్నది ఆసక్తిని పెంచుతోంది.

లక్ష మంది టార్గెట్.. బలప్రదర్శనకు బీజేపీ వ్యూహం

ఈ కార్యక్రమానికి లక్ష మంది ప్రజలను సమీకరించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రతి అసెంబ్లీని యోజకవర్గం నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. కేవలం పార్టీ **మిగతా 02లో**

గద్దె దించడమే లక్ష్యం

చొరబాటుదారులను తరిమికొడతాం




- కాంగ్రెస్ సభపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- చొరబాటుదారులను దేశం నుంచి పంపిస్తామని హెచ్చరిక
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలకు విజ్ఞప్తి

02

కేటీఆర్ సరికొత్త రాజకీయం!

రేవంత్‌పై పోరులో చంద్రబాబుకు కేటీఆర్ కితాబు!

- కేటీఆర్ వ్యాఖ్యలతో జగన్‌కు కొత్త తలనొప్పి!
- మిత్రుడి రాజకీయానికి ఇబ్బందిగా మారిన కేటీఆర్ వ్యూహం!
- తెలంగాణ రాజకీయం.. ఏపీలో వైసీపీకి సెగ!
- కాంగ్రెస్‌పై విమర్శలకు ఏపీ పాలనే అస్త్రం
- కేటీఆర్ వ్యాఖ్యలతో వైసీపీ క్యాడర్‌లో కలవరం
- స్నేహం ఒకవైపు.. రాజకీయ ప్రయోజనాలు మరోవైపు
- కేటీఆర్ కొత్త వ్యూహంతో జగన్‌కు రాజకీయ చిక్కులు!



ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంటోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల మధ్య ఉన్న సాన్నిహిత్యం అందరికీ తెలిసిందే. గతంలో ఒకరికొకరు మద్దతుగా నిలిచిన ఈ ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు రాజకీయ వ్యూహాల కారణంగా కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నాయనే చర్చ సాగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించే క్రమంలో కేటీఆర్ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాలనను, ముఖ్యంగా వాటర్ మేనేజ్‌మెంట్‌ను ప్రశంసించడం జగన్‌కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతోంది.

గతంలో విమర్శలు.. ఇప్పుడు దోస్తీ!

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గొప్పగా ప్రచారం చేసిన కేటీఆర్, అప్పటి ఏపీ ప్రభుత్వ పాలనపై పరోక్ష విమర్శలు చేసేవారు. ఏపీలో విద్యుత్ కోతలు, రోడ్ల దుస్థితి వంటి అంశాలను ప్రస్తావిస్తూ తెలంగాణ మోడల్‌ను సమర్థించుకునేవారు. అయితే అప్పట్లో ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్‌మోహన్ రెడ్డే కావడం గమనార్హం. కానీ ఇప్పుడు రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కేటీఆర్ కొత్త వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. పక్కనే ఉన్న ఏపీలోనూ ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం వాటిని సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రశంసించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తున్నారు.

జగన్‌కు ఇబ్బందికర పరిస్థితి!

కేటీఆర్ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో వైఎస్సార్‌సీపీకి కొత్త తలనొప్పిగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కరవు పరిస్థితులను ఎదుర్కోవడంలో విఫలమైందని, నీటి నిర్వహణలో లోపాలున్నాయని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్న తరుణంలో.. తెలంగాణకు చెందిన కేటీఆర్ మాత్రం చంద్రబాబు **మిగతా 02లో**

వీధుల్లో చెత్త కనిపించొద్దు

అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి!



02

- పారిశుద్ధ్యంపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు
- తాగునీటి వృథాకు చెక్.. గ్రీన్ ట్యాంకర్ల సేవల విస్తరణ
- ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం..
- అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు ప్రణాళికలు

మెట్రోకు నిధులు

మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు

- రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయింపు
- ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం

శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం ప్రతిపాదన



02

కేటీఆర్ బస్సు యాత్ర

నవంబర్ 11 నుంచి ప్రారంభం



02

- 29న భారీ బహిరంగ సభ
- మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు యాత్ర
- సాగునీటి కష్టాలను ఎండగట్టడమే లక్ష్యం

అనిరుధ్‌కు పీసీసీ చీఫ్ క్లాస్

సొంత ప్రభుత్వంపై విమర్శలతో సీరియస్



- జడ్చర్ల ఎమ్మెల్యేకు మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరిక?
- మాటల దూకుడు తగ్గించండి..
- అనిరుధ్ రెడ్డి వైఖరి మారుతుందా?

02

లక్ష మందికి శిక్షణ

అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో కార్యక్రమం



03

- నాన్-స్టెమ్ విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్
- అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు: మంత్రి శ్రీధర్ బాబు

ఇదీ AI ముద్ర

ఒకవేళ మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే.. తాను 'మిస్టర్ వీటో'గా మారి ఒక్క బిల్లు పాస్ కాకుండా అడ్డుకుంటానని ట్రంప్ బాంబ్ పేల్చారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
మంగళవారం, 03 నవంబర్, 2026

పోచ్ ఎగ్స్ కూడా బెస్ట్

గుడ్లను నీటిలో ఉడికించి పోచ్ రూపంలో తీసుకోవడం ఆరోగ్యకరమైన పద్ధతి. ఇందులో అదనపు నూనె అవసరం లేకుండా ప్రోటీన్‌ను పొందవచ్చు.





కేటీఆర్ కొత్త రాజకీయం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ పనితీరును మెచ్చుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. ఈ వ్యాఖ్యలను టీడీపీ నేతలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. జగన్‌కు సన్నిహితుడిగా పేరున్న కేటీఆర్ సైతం చంద్రబాబు పాలనను ప్రశంసిస్తున్నారని సోషల్ మీడియా వేదికగా వైసీపీపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో వైసీపీ నేతలు ఒకవైపు కేటీఆర్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పలేక, మరోవైపు రాజకీయ విమర్శలను కొనసాగించాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారనే చర్చ సాగుతోంది.

రాజకీయమే ముఖ్యమా?

వాస్తవానికి కేటీఆర్ వ్యాఖ్యల వెనుక జగన్‌ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం ఉందని చెప్పలేం. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరుకున పెట్టడమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అవసరమని ఆ పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలో రాజకీయ ప్రత్యర్థిగా భావించే చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశంసించాల్సి వచ్చినా కేటీఆర్ వెనుకాడటం లేదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తన రాష్ట్ర రాజకీయ ప్రయోజనాల కోసం పొరుగు రాష్ట్ర రాజకీయాలను ప్రస్తావించడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది.

చెలిమిపై ప్రభావం పడుతుందా?

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనే నానుడి మరోసారి తెరపైకి వస్తోంది. ఒకప్పుడు సన్నిహితంగా ఉన్న కేటీఆర్, జగన్‌ల మధ్య రాజకీయ అవసరాలు కొత్త సమీకరణాలకు దారితీస్తున్నాయా? కేటీఆర్ వ్యాఖ్యలతో వైసీపీకి ఎదురవుతున్న ఇబ్బందులపై జగన్ ఎలా స్పందిస్తారు? భవిష్యత్తులో ఈ ఇద్దరు నేతల మధ్య స్నేహ సంబంధాలు కొనసాగుతాయా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తెలంగాణలో తన పార్టీ ప్రయోజనాల కోసం కేటీఆర్ అనుసరిస్తున్న వ్యూహం ఏపీలో జగన్ రాజకీయ పోరాటానికి కొత్త సవాలుగా మారుతుందా వేచి చూడాలి.

తెలంగాణపై బీజేపీ ఫుల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలే కాకుండా వైద్యులు, న్యాయవాదులు, మేధావులు, యువతను కూడా భాగస్వామ్యం చేయాలని చూస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించారు. అయితే ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే. లక్ష మందిని సమీకరించడం ఒక ఎత్తయితే, వారిని పార్టీకి ఓటు వేసే రాజకీయ బలంగా మార్చడం మరో ఎత్తు. భారీ జనసమీకరణతో మీడియా దృష్టిని ఆకర్షించవచ్చు. కానీ అది ఎన్నికల ఫలితాల్లో ఎంత వరకు ప్రతిఫలిస్తుందనేదే కీలకం.

కాంగ్రెస్ ప్రభుత్వమే టార్గెటా?

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు అమిత్ షా ఈ వేదికను ఉపయోగించుకునే అవకాశముంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ రాజకీయంగా ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా తామే ఎదుగుతున్నామనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కమలనాథుల వ్యూహం గా కనిపిస్తోంది.



సెమీఫైనల్‌గా పాదయాత్ర?

హైదరాబాద్ రాజకీయాల్లో బీజేపీకి గతంలో గణనీయమైన బలం కనిపించింది. ముఖ్యంగా గ్రేటర్ ఎన్నికల సమయంలో పార్టీ సాధించిన రాజకీయ పురోగతి ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. ఇప్పుడు మరోసారి అదే తరహా ఉత్సాహాన్ని తీసుకురావాలని నాయకత్వం భావిస్తోంది. అమిత్ షా వంటి జాతీయ స్థాయి నేత నేరుగా రంగంలోకి దిగడం పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని పెంచవచ్చు. అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో మళ్లీ పట్టు సాధించాలంటే కేవలం జాతీయ నాయకుల పర్యటనలు సరిపోవు. స్థానిక సమస్యలపై నిరంతర పోరాటం, బలమైన నాయకత్వం, క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కూడా అవసరం.


జనసమీకరణ నుంచి ఓట్ల సమీకరణ వరకు!


రాజకీయ పార్టీలకు భారీ ర్యాలీలు, పాదయాత్రలు తమ బలాన్ని ప్రదర్శించుకునే అవకాశాలు కల్పిస్తాయి. కానీ ప్రజల స్పందనను కేవలం జనసందోహంతో కొలవలేం. పాదయాత్రకు వచ్చిన వారిలో ఎంతమంది పార్టీకి కట్టుబడి ఉంటారు? యువతను ఎంతవరకు ఆకర్షించగలుగుతుంది? ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకోగలుగుతుందా? అన్న ప్రశ్నలకు భవిష్యత్తులో సమాధానాలు లభించనున్నాయి. మొత్తానికి అమిత్ షా హైదరాబాద్ పాదయాత్ర బీజేపీకి ఒక రాజకీయ శక్తి ప్రదర్శన మాత్రమే కాదు.. తెలంగాణలో తన భవిష్యత్ రాజకీయ వ్యూహానికి ఒక పరీక్ష కూడా. కాంగ్రెస్‌కు గట్టి సవాల్ విసరడంతో పాటు, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలన్న లక్ష్యాన్ని ఈ కార్యక్రమం ఎంతవరకు ముందుకు తీసుకెళ్తుందో చూడాలి. లక్ష మందితో పాదయాత్ర నిర్వహించడం బీజేపీకి హైప్ తీసుకురావచ్చు. కానీ ఆ హైప్‌ను ఓట్లుగా, రాజకీయ అధికారంగా మార్చుకోగలిగితేనే అసలైన విజయం సాధించినట్లవుతుంది.

ముంచుకొస్తున్న మురసు తుఫాన్

ముద్ర, అమరావతి :

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తీవ్ర తుఫాన్ ఆంధ్రప్రదేశ్ తీరంవైపు వేగంగా కదులుతోంది. ప్రస్తుతం నెల్లూరుకు 100 కిలోమీటర్లు, కావలికి 120 కిలోమీటర్లు, ఒంగోలుకు 160 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుఫాన్ ఇవాళ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుఫాన్ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. మరోవైపు తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. RTGS అధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి క్షేత్రస్థాయిలో చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అర్నబ్ తుఫాన్‌తో పోలిస్తే మురసు ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేశారు. అలాగే నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలోకి 13 నుంచి 15 టీఎంసీల వరకు వరద నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. వర్షపు నీటిని వృథా కాకుండా గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు తదితర ప్రాంతాల్లోని చెరువులు, రిజర్వాయర్లను నింపాలని సీఎం సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు.





కాంగ్రెస్‌ను గద్దె దించుతాం

ముద్ర, హైదరాబాద్ :

హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అంతం చేయండి' (లోక్‌తంత్ర బచావో–అరాజకతా హటావో) మహాపాదయాత్ర, బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. 'భారత్ మాతాకీ జై', 'జైశ్రీరామ్' నినాదాలతో తమ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, పాతబస్తీలోని శ్రీభాగ్య లక్ష్మి అమ్మవారిని, భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను భక్తిశ్రద్ధలతో స్మరించుకున్నారు. నాడు సర్దార్ పటేల్ గనుక నిజాం నిరంకుశ పాలనను లొంగదీసుకోకపోతే హైదరాబాద్, తెలంగాణ భూభాగం ఈరోజు భారతదేశంలో అంతర్భాగంగా ఉండేవి కావని నొక్కి చెప్పారు. అలాగే గిరిజన విప్లవ వీరులు కొమరం భీమ్, రామ్‌జీ గోండ్‌ల అమరపోరాటాలను ఈ సందర్భంగా కొనియాడారు.


అది 'ఓట్ బచావో' కాదు 'చొరబాటుదారుల రక్షణ' సభ

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన సభపై అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్నది ఓటర్ల పరిరక్షణ ర్యాలీ కాదని, ఓటర్ల జాబితాలోకి చొరబడిన అక్రమార్కులను కాపాడేందుకు ఆ పార్టీ పన్నుతున్న కుట్ర అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయంటూ దొంగ ప్రచారాలు చేస్తోందని, నిజానికి ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆరున్నర కోట్ల మంది ఓటర్ల పేర్లను నిబంధనల ప్రకారమే సవరించారని వివరించారు. రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎంతగా అడ్డుపడినా, చొరబాటుదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా ఈ దేశం నుంచే వెళ్లగొడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించాలి.. తెలంగాణలో మార్పు రావాలి

తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని రక్షించి, అరాచక పాలనకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని అమిత్ షా స్పష్టం చేశారు. రాష్ట్రంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

మెట్రోకు నిధులు



ముద్ర, హైదరాబాద్ :

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్–2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది. నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్–2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి. రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం–కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్–చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను కలిపే కారిడార్లను ప్రతిపాదించారు. మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు. ఈ నిధుల కేటాయింపుతో ఫేజ్–2 పనులకు సంబంధించిన తదుపరి చర్యలు ముందుకు సాగనున్నాయి.

వీధుల్లో చెత్త కనిపించొద్దు

ముద్ర, హైదరాబాద్ :

హైదరాబాద్ మహానగరాన్ని పూర్తిస్థాయిలో పరిశుభ్రమైన, ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నగర వీధుల్లో ఎక్కడా చెత్త నిల్వలు కనిపించకూడదని, ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి వ్యర్థాల సేకరణ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

నిర్మాణ రంగ వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, పారిశ్రామిక వాడల్లో ఐలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్యాన్ని కాపాడాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తాగునీటి ఆదాకు గ్రీన్ ట్యాంకర్లు.. విస్తరణకు ఆదేశాలు

నగరంలో విస్తరిస్తున్న నిర్మాణ రంగ పనులు, పార్కుల సంరక్షణ, ల్యాండ్‌స్కేపింగ్, తోటల పెంపకం వంటి అవసరాల కోసం విలువైన తాగునీటిని వాడటం తగ్గించాలని ముఖ్యమంత్రి సూచించారు. మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా రీసైకిల్ చేసిన నీటిని సరఫరా చేసేందుకు అందుబాటులోకి తెచ్చిన 'డయల్ గ్రీన్ ట్యాంకర్' సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

జలమండలి తొలి విడతగా 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా ఈ సేవలను ప్రారంభించిందని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో కూడా ఈ గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా నగరంలో సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

కేటీఆర్ బస్సు యాత్ర

ముద్ర, హైదరాబాద్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర చేపడతారని తెలిపారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగుతుందని వివరించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తూ, రైతుల ఇబ్బందులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామన్నారు.

మరోవైపు, తెలంగాణ ఉద్యమంలో చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు గంగుల తెలిపారు. 2009లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను ఏర్పాటు చేయనున్నామన్నారు. సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.



అనిరుధ్ రెడ్డికి పీసీసీ చీఫ్ క్లాస్

ముద్ర, హైదరాబాద్ :

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. సొంత పార్టీ ప్రభుత్వంపైనే తరచూ విమర్శలు చేస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అనిరుధ్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనిరుధ్ రెడ్డి.. తన వ్యాఖ్యలతో తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. గతంలోనూ సొంత పార్టీ నేతలు, ప్రభుత్వ నిర్ణయాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ముఖ్యంగా తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయి. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టుల విషయంలోనూ ఆయన చేసిన ఆరోపణలు వివాదాస్పదమయ్యాయి.

సారా నుంచి సీఎం అభ్యర్థి వరకు..

గతంలో రాష్ట్రంలో మళ్లీ ఇప్పసారా దుకాణాలు ప్రారంభించాలని, గతంలో సారా తాగినవారు 115 ఏళ్లు బతికారంటూ అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. సినీ నటులకు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని కూడా ఆయన సూచించారు. మరో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాను కూడా సీఎం అభ్యర్థినేనంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.





నిధులపై సొంత ప్రభుత్వానికే అల్టిమేటం!

ఇటీవల జడ్చర్ల నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అనిరుధ్ రెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. నిధులు విడుదల చేయకపోతే 30 వేల మందితో దీక్షకు దిగుతానని హెచ్చరించారు. తన ప్రాణం పోయినా సరే నిధులు సాధిస్తానని, తాను చనిపోయిన తర్వాతే నిధులు ఇస్తారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

క్రమశిక్షణపై పీసీసీ చీఫ్ సీరియస్

అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగంగానే స్పందించారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని ఉపేక్షించబోమనే సంకేతాలు ఇచ్చారు. తాజాగా ఆయన ఎమ్మెల్యేకు ఫోన్ చేసి మాట్లాడినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు వడ్డీల చెల్లింపులు, పెండింగ్ బిల్లుల విడుదలలో ఉన్న ఇబ్బందులను వివరించినట్లు సమాచారం. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు చేసే విషయంలో ఆచితూచి వ్యవహరించాలని సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మరి పీసీసీ చీఫ్ క్లాస్‌తోనైనా అనిరుధ్ రెడ్డి తన వ్యాఖ్యల తీరును మార్చుకుంటారా? సొంత ప్రభుత్వంపై విమర్శలకు స్వస్తి చెబుతారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 3.11.2026
www.mudranews.in | @mudranews

ఒక గుడ్డులో 6.3 గ్రాముల ప్రోటీన్

ఒక పెద్ద గుడ్డులో సుమారు 6.3 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. గుడ్డును ఏ పద్ధతిలో వండినా దాని ప్రోటీన్ పరిమాణంలో పెద్దగా మార్పు ఉండదు.



లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ

- అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- నాన్-స్టెమ్ విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్
- అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు: మంత్రి శ్రీధర్ బాబు

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రభుత్వంపై, కళాశాలలు లేదా విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (AWS) సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాస్క్, AWS మధ్య ఒప్పందం కుదిరింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక



అంశాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు.

900కు పైగా ఆన్‌లైన్ కోర్సులు ఉచితం

విద్యార్థులు ప్రాక్టికల్‌గా నేర్చుకునేందుకు AWS క్లౌడ్ కన్సోల్ సౌకర్యం కల్పించనున్నారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ వంటి నాన్-స్టెమ్ కోర్సుల విద్యార్థులకు కూడా ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్ అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో చేరిన ప్రతి విద్యార్థికి 'AWS Skill Builder' ద్వారా 900కు పైగా డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించనున్నారు. అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్ పరీక్షలకు డిస్కౌంట్ వోచర్లు కూడా అందిస్తారు.

శిక్షణ అనంతరం జాబ్ మేళాలు

విద్యార్థులకు సాంకేతిక నిపుణులతో ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్‌లు నిర్వహించనున్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. విద్యార్థులతో పాటు ఆయా కళాశాలల అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ సాంకేతికతల్లో ప్రపంచస్థాయి శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, టాస్క్ సీఈవో నితిన్ రెడ్డి, AWS ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ సందీప్ దత్తా, ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెట్ అవకాశాలు

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, వారి వ్యాపారాలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ను ఏర్పాటు చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 నేపథ్యంలో మంత్రి సీతక్క అధ్యక్షతన ఈ కౌన్సిల్ పనిచేయనుంది. వీ హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల సభ్య కన్వీనర్ గా వ్యవహరిస్తారు. విధానాలు, పట్టణ ఆవిష్కరణలు, సామాజిక ప్రభావం, పెట్టుబడులు, ఆర్థిక సహకారం వంటి నాలుగు ప్రధాన అంశాలపై కౌన్సిల్ దృష్టి సారించనుంది. మహిళా వ్యాపారాలకు ఎదురవుతున్న అడ్డంకులు, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై రూపొందించే శ్వేతపత్రాన్ని డిసెంబర్ 8న విడుదల చేయనున్నారు. వీ హబ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుండగా, ఎర్నెస్ట్ అండ్ యంగ్ (EY) ప్రచురణ భాగస్వామిగా ఉంటుంది. మహిళా వ్యాపారాలను రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ఈ కౌన్సిల్ లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది.

మంత్రి సీతక్కను కలిసిన స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్

ముద్ర, హైదరాబాద్ : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు నూతనంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన నవీన్ మిట్టల్ సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు పూల మొక్కను అందజేసి తన కృతజ్ఞతలు తెలిపారు. నవీన్ మిట్టల్‌ను మంత్రి సీతక్క అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరోగ్యకరమైన గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.



తితిదే పాలకమండలి స్థానంలో ప్రత్యేక అధికారుల కమిటీ

ముద్ర, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పదవీకాలం ముగియడంతో నూతన పాలకమండలి ఏర్పాటు అయ్యే వరకు పరిపాలన నిర్వహణకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక అధికారుల కమిటీని నియమించింది. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ఐఏఎస్ కమిటీ ఛైర్మన్‌గా, ఆర్థిక శాఖ కార్యదర్శి వి. వినయ్ చంద్, రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ కార్యదర్శి కె. కన్నబాబు సభ్యులుగా నియమితులయ్యారు. 1987 ఏపీ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టంలోని సెక్షన్ 137 ప్రకారం ఈ నియామకం చేపట్టారు. ఈ కమిటీ పాలకమండలికి ఉన్న అన్ని అధికారాలను వినియోగిస్తూ, దాని విధులను నిర్వహిస్తుంది. కమిటీ ఏడాది పాటు లేదా నూతన పాలకమండలి ఏర్పాటయ్యే వరకు, ఈ రెండింటిలో ఏది ముందుగా జరిగితే అప్పటివరకు కొనసాగుతుంది.

85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశం నిర్వహణ

ముద్ర, హైదరాబాద్: 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (IRC) సమావేశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు జరగనున్న ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సమావేశాన్ని ఘనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, వివిధ రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులు, ఇతర దేశాల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల డెలిగేట్లు హాజరుకానున్నారని తెలిపారు. సదస్సుకు వచ్చే అతిథులకు వసతి, రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రత్యేకంగా 'తెలంగాణ పెవిలియన్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌పై అన్ని మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ విమానాశ్రయం, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రజా రవాణా కేంద్రాల్లో హోర్డింగులు, ప్రత్యేక విజువల్ ప్రకటనలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు విమానాశ్రయాలు, మెట్రో రైళ్లలోనూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న గ్లోబల్ సమ్మిట్ 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రీ–సమ్మిట్‌గా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయాలని, రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.



అమ్మకావాలి.. బాలుడి రోదన.. కన్నీళ్లు పెట్టించింది..

ముద్ర, జగిత్యాల : కన్న బిడ్డ కాకపోయినా.. మూడేళ్లు పెంచిన ప్రేమ.. బిడ్డ కోసం ఆ దంపతులు పడుతున్న ఆవేదన.. మరోవైపు అమ్మ కావాలంటూ ఆ బాలుడు వెక్కి వెక్కి ఏడుస్తున్న హృదయ విదారక దృశ్యం జగిత్యాలలో కనిపించింది. జగిత్యాల కి చెందిన కాసర్ల శ్రీనివాస్ – సరిత దంపతులకు పిల్లలు లేరు. ఓ మగ బిడ్డను దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. అయితే ఆ దత్తతను న్యాయపరంగా తీసుకోకపోవటంతో.. కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తి శిశు సంక్షేమ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బిడ్డను అధికారులు తీసుకుని వారి సమక్షంలోనే ఉంచారు. ఈ విషయంలో హైకోర్టుకు వెళ్లగా బిడ్డను దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అయితే అధికారులు దంపతులకు అప్పగించకపోవటంతో జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్‌ను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ బిడ్డను ఇవ్వడంలేదని కన్నీటి పర్యంతమవుతున్నారు.

వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్‌పై ప్రత్యేక దృష్టి

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన పథకాల అమలును వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను సాధించాలని TGREDCO వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని TGREDCO ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల మేనేజర్లు, పథకాల అమలు సంస్థల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, రాష్ట్రంలో అమలవుతున్న పునరుత్పాదక ఇంధన కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మోడల్ సోలార్ విలేజ్, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు, వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, పీఎం–కుసుమ్ పథకం, ఇంధన పొదుపు కార్యక్రమాలు, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సమీక్షించారు.

రూఫ్‌టాప్ సోలార్‌కు ప్రాధాన్యత

గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారుల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును విస్తృతం చేయాలని ఎండీ సూచించారు. సోలార్ విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, పీఎం–కుసుమ్ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వివిధ శాఖల నుంచి రావాల్సిన అనుమతులు, పెండింగ్‌లో ఉన్న తనిఖీలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం లేకుండా జిల్లా మేనేజర్లు, అమలు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇంధన పొదుపు, సమర్థవంతమైన విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. జిల్లా మేనేజర్లు, అమలు సంస్థల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ సమావేశంలో TGREDCO జనరల్ మేనేజర్ జి.ఎస్.వి. ప్రసాద్‌తో పాటు వివిధ విభాగాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. అన్ని జిల్లాల మేనేజర్లు, పథకాల అమలు సంస్థల ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

బీసీ కులగణన చేపట్టాలి.. లేదంటే కేంద్రం గద్దె దిగాలి

ఓబీసీ కాలమ్ చేర్చకపోతే బీజేపీకి బీసీలే రాజకీయ సమాధానం చెబుతారు: జాజుల శ్రీనివాస్ గౌడ్
అమిత్ షా కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలి.. కిషన్ రెడ్డి మౌనం సిగ్గుచేటు
బీజేపీ జాతీయ నేతల తెలంగాణ పర్యటనలను అడ్డుకుంటాం
అమిత్ షా హైదరాబాద్ పర్యటనకు వ్యతిరేకంగా బీసీ సంఘాల నిరసన

ముద్ర, హైదరాబాద్: బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చి మాట తప్పిన బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా తగిన గుణపాఠం చెబుతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చకపోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ సోమవారం అంబర్‌పేటలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఎదుట బీసీ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశంలోని సుమారు 80 కోట్ల మంది బీసీల చిరకాల ఆకాంక్ష అయిన కులగణన కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రయోజనాల కోసం బీసీ కులగణన చేపడతామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చకుండా బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. బీసీల జనాభా లెక్కలు లేకపోతే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారి హక్కులు, ప్రాతినిధ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.బీసీల ఓట్లతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఎదిగిన కిషన్ రెడ్డి.. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీసీ కులగణన చేపట్టడం చేతకాకపోతే



అమిత్ షా కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, బీజేపీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు తెలంగాణలో పర్యటిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. బీజేపీలోని బీసీ నాయకులు ప్రధాని మోదీ, అమిత్ షాల వైఖరిపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.బీసీ జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చడంతో పాటు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 14, 15 తేదీల్లో వేలాది మందితో ఢిల్లీని ముట్టడించి కేంద్ర ప్రభుత్వానికి బీసీల సత్తా చూపిస్తామని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, కుందారం గణేష్ చారి, గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కసకాల శ్యాం కుర్మా, పిట్ల శ్రీధర్, ఉప్పరి శేఖర్ సగర తదితర బీసీ సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు స్కిల్ యూనివర్సిటీ ముస్తాబు

ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

ముద్ర, హైదరాబాద్ : స్కిల్ యూనివర్సిటీలో త్వరలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో చేపడుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల పనులను రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యూనివర్సిటీలో చేపడుతున్న వివిధ పనుల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రముఖులు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.



రెవెన్యూ–ఫారెస్ట్ భూ సరిహద్దు వివాదాలకు జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
రైతులు, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం కలగకూడదు

ముద్ర, హైదరాబాద్ : రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ వివాదాల కారణంగా రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా రెండు శాఖలు సమన్వయంతో సంయుక్త సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతులను వినియోగించి క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వేలు చేపట్టాలని సూచించారు. భూముల సరిహద్దులను కచ్చితంగా గుర్తించి, భవిష్యత్తులో తిరిగి వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. జాయింట్ సర్వేలకు రైతులు, ప్రజలు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పీసీసీఎఫ్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
మంగళవారం, 03 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

ఇంజక్షన్ త్వరగా
రిలీఫ్ ఇస్తుందా?

మనం నోటి ద్వారా మాత్రలు వేసుకున్నప్పుడు అవి వెంటనే రక్తంలోకి చేరవు. ముందుగా కడుపులో కరిగి, ఆ తర్వాత ప్రధానంగా చిన్నపేగుల ద్వారా రక్తంలోకి శోషిస్తాయి. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. మందు రక్తంలోకి చేరిన తర్వాతే అది శరీరంలోని అవసరమైన భాగానికి చేరుకుని పనిచేయడం ప్రారంభిస్తుంది. అందుకే కొన్ని మాత్రలు వేసుకున్న వెంటనే ఉపశమనం కలగదు. మందు రకం, మన శరీర పరిస్థితి, ఆహారం తీసుకున్న సమయం వంటి అంశాలను బట్టి అది పనిచేయడానికి పట్టే సమయం మారుతుంది.



వేగంగా పనిచేయడానికి కారణం?

ఇంజెక్షన్ ద్వారా మందును శరీరంలోకి పంపినప్పుడు, ముఖ్యంగా నేరుగా రక్తనాళంలోకి ఇచ్చే ఇంజెక్షన్ (IV) విషయంలో, జీర్ణవ్యవస్థలో జరిగే ప్రక్రియలను దాటవేయవచ్చు. దీంతో మందు నేరుగా రక్తప్రవాహంలోకి చేరుతుంది. దీని వల్ల మందు శరీరమంతా వేగంగా ప్రయాణించి అవసరమైన చోటుకు చేరుతుంది. అందుకే అత్యవసర పరిస్థితుల్లో, తీవ్రమైన నొప్పి ఉన్నప్పుడు లేదా వెంటనే చికిత్స అవసరమైనప్పుడు వైద్యులు IV ఇంజెక్షన్లను ఎంచుకోవచ్చు. అయితే ప్రతి ఇంజెక్షన్ వెంటనే పనిచేస్తుందని చెప్పలేం. అది ఏ రకమైన మందు అనే అంశంపై ప్రభావం ఆధారపడి ఉంటుంది.

లివర్ పాత్ర?

మాత్రల ద్వారా శరీరంలోకి వెళ్లిన అనేక మందులు రక్తంలోకి చేరిన తర్వాత కాలేయం గుండా ప్రయాణిస్తాయి. ఈ సమయంలో కాలేయం మందులో కొంత భాగాన్ని విచ్ఛిన్నం చేయవచ్చు. ఈ ప్రక్రియను వైద్య పరిభాషలో 'ఫస్ట్ పాస్ మెటబాలిజం' (First-pass metabolism) అంటారు. దీంతో మందులో కొంత భాగం మాత్రమే రక్తప్రవాహంలోకి చేరే అవకాశం ఉంటుంది. అయితే అన్ని మందుల విషయంలోనూ ఈ ప్రభావం ఒకేలా ఉండదు. IV ఇంజెక్షన్ ద్వారా మందును నేరుగా రక్తంలోకి ఇచ్చినప్పుడు, మొదటిసారి కాలేయం గుండా వెళ్లే ప్రక్రియ ఉండదు. అందువల్ల ఇచ్చిన మందు మొత్తం రక్తప్రవాహంలోకి చేరుతుంది. దీనినే 100 శాతం బయోఅవైలబిలిటీ (Bioavailability) అంటారు. అయితే ఆ తర్వాత మందు శరీరంలో ఎలా పంపిణీ అవుతుంది, ఎలా విచ్ఛిన్నమవుతుంది అనే అంశాలు కూడా దాని ప్రభావాన్ని నిర్ణయిస్తాయి.

ఒకే వేగంతో పనిచేస్తాయా?

అన్ని ఇంజెక్షన్లు ఒకే విధంగా పనిచేయవు. వాటిని శరీరంలోకి ఇచ్చే పద్ధతిని బట్టి మందు శోషించబడే వేగం మారుతుంది.

IV ఇంజెక్షన్ (Intravenous): మందును నేరుగా రక్తనాళంలోకి ఇస్తారు. ఇది అత్యంత వేగంగా పనిచేసే పద్ధతి. కొన్ని మందులు ఇచ్చిన వెంటనే ప్రభావం చూపవచ్చు.

IM (Intramuscular) ఇంజెక్షన్: మందును కండరాల్లోకి ఇస్తారు. అక్కడి నుంచి రక్తంలోకి శోషించబడుతుంది. మందును బట్టి దీని ప్రభావం మొదలయ్యే సమయం మారుతుంది.

SC (Subcutaneous) ఇంజెక్షన్: మందును చర్మం కింద ఉన్న కొవ్వు పొరలోకి ఇస్తారు. అక్కడి నుంచి నెమ్మదిగా రక్తంలోకి చేరుతుంది. అందువల్ల కొన్ని మందులు ఎక్కువ సమయం పాటు పనిచేసేలా ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. కాబట్టి ఇంజెక్షన్ వేగం అనేది మందు ఇచ్చే పద్ధతితో పాటు, ఆ మందు లక్షణాలపై ఆధారపడి ఉంటుంది.

ఏది మంచిది?

మాత్రలు, ఇంజెక్షన్లు రెండింటికీ ప్రత్యేకమైన ఉపయోగాలు ఉన్నాయి. సాధారణంగా తీసుకునే చాలా మందులు సరైన మోతాదులో వాడితే సమర్థంగా పనిచేస్తాయి. ప్రతి సమస్యకు ఇంజెక్షన్ అవసరం ఉండదు. ఉదాహరణకు, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా చికిత్స అందించడానికి IV ఇంజెక్షన్లు ఉపయోగపడవచ్చు. మరోవైపు, దీర్ఘకాలిక సమస్యలకు కొన్ని మాత్రలు సౌకర్యవంతంగా ఉంటాయి. కొన్ని మందులను నోటి ద్వారా తీసుకోవడం సాధ్యం కానప్పుడు కూడా ఇంజెక్షన్లను ఎంచుకుంటారు.

మందు ఏ రూపంలో ఇవ్వాలనే విషయాన్ని రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రత, మందు రకం, అవసరమైన చికిత్స వేగాన్ని బట్టి వైద్యులు నిర్ణయిస్తారు. ఇంజెక్షన్ తీసుకుంటేనే త్వరగా నయం అవుతారని భావించడం సరైంది కాదు. వైద్యుల సూచన లేకుండా ఇంజెక్షన్లు తీసుకోవడం కూడా ప్రమాదకరం కావచ్చు. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం.. ఇంజెక్షన్ వేగంగా పనిచేయడానికి ప్రధాన కారణం మందు శరీరంలోకి చేరే మార్గం. అయితే సరైన మందును, సరైన మోతాదులో, సరైన పద్ధతిలో తీసుకోవడమే ముఖ్యం.

పేదోడి బువ్వపై పెద్దల దందా..!



నారు పోసినోడు కాదు.. నీరు పెట్టినోడు కాదు.. కలుపు తీసినోడు కాదు... ఎరువేసినోడు కాదు... కోత కోసినోడు కాదు.. పంటను కన్నబిడ్డలా సాకినోడు అంతకన్నా కాదు.. ధర వ్యాపారులే నిర్ణయించి దాన్యాన్ని అగ్గువనగ్గువకు లాగేసుకున్నరు...! బియ్యం కావాలని పోతే రేటు వ్యాపారులే నిర్ణయించి దోచుకుంటుండు ఇదేమి చోద్యం... ఇదేమి రాజ్యం...!

వడ్లకు రేటు ఉండదు..బియ్యం రేటుకు అంతు ఉండదు.. పత్తికి రేటు ఉండదు.. పరుపులకు, బట్టలకు రేటు కొనడానికి అందదు.. రైతు అమ్మితే రేట్లు వ్యాపారులు నిర్ణయించి తక్కువకు కొంటారు.. ముడి నరుకు రూపు రేఖలు మార్చి రేట్లు వ్యాపారులే నిర్ణయించి ముడ్డిమీదతంతరు.. ఇంకెన్నాళ్లు అన్నదాతల అరిగోస..!

వానాకాలం సీజన్లో వరి రికార్డు ఉత్పత్తి – గత వానాకాలం బియ్యం అమ్ముతున్నా రేట్లు అందనంత ఆకాశంలో..! పాలకులెందరు మారినా మారని పాలితుల బతుకులు – నీరు లేక కన్నీరుతో పండించినా రైతుల బాధలు వర్ణనాతీతం...!

అధికారులు జర దేఖో సార్లూ...!!

అన్నం మెతుకుపై అక్రమ వ్యాపారులు కన్నేశారు. తమ అధిక సంపాదనకు అడ్డాగా పేదోడి బువ్వను మార్చుకున్నారు. వెనుకటికి అయితే మొదట్లో రాజులు, తర్వాత దొరలు, భూస్వాములు, ధనికులు అన్నాన్ని తినేవారు. గతంలో పేదలు జొన్న, రాగి, సద్ద, తైదల సంగటి తినేవారు. అన్నం దొరికితే మహాభాగ్యం. కాలక్రమేణా వచ్చిన మార్పులతో ఇప్పుడు వరి అన్నాన్ని పేదలు తింటు ధనికులు మాత్రం చిరు దాన్యాలు, సిరి దాన్యాలు అరికెలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఊదలు, వరిగెలు, అండుకొర్రలు, సామలు తింటూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు. పేదలు, మధ్యతరగతి వారు ఎక్కువగా తినే బియ్యం ప్రస్తుతం మార్కెట్లో సెంచరీ దాటి సామాన్య జనాలు కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. అడ్డు అదుపు లేకుండా బియ్యం వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో రేట్లు పెంచుకుంటూ ప్రస్తుతం కిలో సన్న బియ్యం రేటు సెంచరీ దాటించారు. వ్యాపారుల దోపిడీకి, ఆశకు అంతులేకుండా పోయింది. ఇలా చేసిన అక్రమ సంపాదన బియ్యాన్ని దాచుకో, రేట్లను పెంచుకో, ప్రజలను దోచుకో అన్న రీతిలో భయంకరంగా దోపిడీకి పాల్పడుతున్నారు అన్న ఆరోపణలు. వినవస్తున్నాయి. ఎవరు ఎంత ఎగిరినా, ఎంత అక్రమ సంపాదన సంపాదించినా చిల్లి గవ్వ కూడా తనతో తీసుకుపోలేని తాత్కాలికమైన ఈ జీవితానికి ఎందుకంత అత్యాశ దుస్థితి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఈ భూగ్రహంపై ప్రతి వ్యక్తి కూడా ఒక టూరిస్ట్ గా వచ్చాము తప్పించి భూమిపై శాశ్వతంగా ఉండటానికి కాదన్న జీవిత సత్యాన్ని ప్రతివారు తెలుసుకుంటే, ఎవరి టూరిస్ట్ వీసా ముగిసిపోతే భూగ్రహాన్ని వదిలిపెట్టి వెళ్లడం తప్పదన్న సత్యాన్ని కూడా గ్రహించాలని, అప్పుడే మనిషి తోటి మనిషిని గౌరవించే ఒక మానవతా హృదయం ఉంటుందనేది మేధావులు, విజ్ఞులు, విజ్ఞానవంతులు పేర్కొనే నిత్య సత్యం.

ఎల్నినో బూచి చూపి..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ప్రకృతిలో ఎల్నినో ప్రభావం తదితర అంశాలను బూచిగా చూపి బియ్యం మిల్లర్లు, వ్యాపారులు బియ్యం అక్రమ దందాకు తెరలేపారు. సన్న బియ్యం దొరకడం లేదని, భవిష్యత్తో మరింతగా కొరత ఉంటుందని లేనిపోని భయాలను ప్రచారం చేసి తాము అనుకున్నకాడికి రేట్లు ఇష్టారాజ్యంగా పెంచి ప్రస్తుతం బియ్యం రేటును కిలో పంద రూపాయలకు పెంచి సామాన్యుడిని దోచుకుంటున్నారు. సన్నబియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడంతో వ్యాపారులు తమ జేబులలో మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నారు. బియ్యంను బ్లాక్ చేసి రేట్లను పెంచి అక్రమ దోపిడికి తెరలేపడంతో సామాన్యుల బతుకుల్లో గుబులు మొదలైంది. ధాన్యం దండిగా ఉన్నప్పటికి బియ్యం ధరలకు రెక్కలు ఎలా వచ్చాయో, ఎందుకు

వచ్చాయో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. బియ్యం వ్యాపారుల అక్రమ దందాలో సన్నబియ్యం ధరల మంట గ్యాస్ స్టవ్, పొయ్యిల మీద సలసల కాగుతుంది. బియ్యం వ్యాపారుల ధరల ఇష్టారాజ్యంతో సామాన్య ప్రజలకు భారంగా మారింది. సన్న బియ్యం బహిరంగ మార్కెట్లో ఒక బంగారంలా మారడంతో అన్నం సామాన్య ప్రజలకు అందకుండా పోతుంది. కడుపు నిండా తిన్నది లేదు. బియ్యం రేట్లతోని నిద్ర కూడా సగటు మనిషికి కరువైందని చెప్పవచ్చు. సన్న బియ్యంపై వ్యాపారుల కన్ను పడడం, తమ అడ్డగోలు సంపాదనకు ఒక మార్గంగా ఉడడంతో వ్యాపారుల దోపిడి పరాకాష్టకు చేరుకుంది. బియ్యం బస్తాల్లోకి చేరిన బ్లాక్ దందాతో ఇష్టవచ్చినట్టుగా సిండికేట్గా మారి రేట్లు వ్యాపారులు జోరుగా పెంచుతున్నారు. గోదాముల్లో కావాల్సినంత నిల్వలు న్నప్పటికీ మార్కెట్లో బియ్యం ఎందుకు మండుతున్నాయో, ఎందుకు కుతకుత ఉడుకుతున్నాయో అర్థం కాని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. సన్నబియ్యం సాకుతో జరుగుతున్న వ్యాపారుల సొమ్ముల వేట ఇంకెంతకాలం. వ్యాపారులు అడ్డగోలు ధరల ఆటలకు సామాన్యులు బలవుతున్నారు. అడ్డు అదుపూ లేని బియ్యం ధరలను అధికారులు ఎందుకు నియంత్రిచడం లేదో, వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్టలు ఎందుకు అదికారులు వేయడంలేదో, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అని సామాన్యుడు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనపాత్ర ఇంకెంతకాలమని, ధరల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారని, బియ్యం వ్యాపారులు అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేసేవారు ఎక్కడ అని, వ్యాపారుల దందాపై నిఘా ఎక్కడని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సరిపడా నిల్వలు ఉన్నా ధరల పెంపు?

ఎల్నినో ప్రభావం ఇప్పటికిప్పుడు ఈ దాన్యం సీజన్పై లేనప్పటికీ వ్యవసాయమే తెలియని వ్యాపారులు మాత్రం కృతిమ కొరత సృష్టిస్తున్నారు. వాస్తవానికి ఇప్పుడు అమ్మే బియ్యం గత వానకాలం సీజన్. గత సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అయ్యింది. గోదాముల్లో, బహిరంగ మార్కెట్లో సరిపడా నిల్వలున్నాయి. అనేక మిల్లులలో దాన్యపు రాశులు గలగల లాడుతున్నాయి. అయినప్పటికి ఎల్నినో బూచి చూచి బియ్యాన్ని బ్లాక్ చేసిన వ్యాపారులు సన్నబియ్యం ధరలను సెంచరీ దాటించారు.

కన్నీరే నీరుగా కష్టిస్తున్న రైతన్నలు


ఎల్నిలో ప్రభావం వాస్తవానికి రాబోయే ఈ సీజన్పై పడుతుంది. వరి పంటను పండించాలంటే ఎంత కష్టముంటదో రైతన్నలకు మాత్రమే తెలుసు. బురద నుంచి తెల్లటి బువ్వను ఇస్తున్న రైతన్నలు తమ ఉత్పత్తులకు మద్దతు ధర, అసలు గిట్టుబాటు ధర కూడా ఏ పాలకులు ఇవ్వలేదు. బహుశా భవి ష్యత్లో కూడా ఇవ్వరేమో. పాలకులు ప్రకటించే మద్దతు ధర కూడా అరకొర పెంపు మాత్రమే. అయితే ఎన్నో సాకులు చూసి మద్దతు ధర కంటే చాలా తక్కువకు వడ్లు వ్యాపారులు కొనడం షరామామూలే. గిట్టుబాటు ధర ఇంకెక్కడి నుంచి వస్తది. ఏదన్నా తయారీదారు తన ఉత్పత్తికి తానే ధర నిర్ణయిస్తాడు. ఎనభైఏళ్ల స్వతంత్ర భారతంలో రైతు మాత్రం తన ఉత్పత్తులకు కొనుగోలుదారు నిర్ణయించిన రేటుకు అమ్ముకునే దుస్థితి నెలకొంది. తక్కువ ధరకు వడ్లు కొనడం, బియ్యంగా మార్చి దళారి వ్యవస్థ వలన రేట్లు బియ్యం అమ్మేవారే నిర్ణయించడం మన దౌర్భాగ్యం. రైతు తన వడ్లకు రేటు నిర్ణయించేదిలేదు, వ్యాపారి మాత్రం బియ్యంకు రేటు నిర్ణయించవచ్చు ఎలాంటి ప్రజాసామ్య వ్యవస్థలో ఉన్నాం మనం. ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి ఉంటుందా... రైతన్నకు, బియ్యం పేరుతో సామాన్యులకు జరిగే ఈ దళారి వ్యవస్థ దోపిడి పాలకులకు తెలియదా... తెలిసినా మిన్నకుండడంలో ఉన్న అర్థం, పరమార్థం ఏమిటో తెలుసుకోలేనంత వరకు అన్నదాతల పరిస్థితి అట్టడుగున అలాగే పడి ఉంటుందేమో. ఇంకెంతమంది పాలకులు మారినా రైతుల దోపిడికి అంతం ఉండదనేది నగ్న సత్యం. ఇలాంటి దుర్భర పరిస్థితులు తట్టుకోలేక ఒకవైపు, బియ్యం వ్యాపారులు దళారుల ఆగడాలు తట్టుకోలేక మరొకవైపు, దళారి వ్యవస్థ నిర్మూలించలేక ఇంకొక వైపు అసలు వ్యవసాయమే చేసే రైతులు ఇప్పటికే చాలా తగ్గిపోయారు, భవిష్యత్తులో ఇంకా తగ్గకుండా చూడాల్సిన బాధ్యత ఎవరిది అని సమాజం ప్రశ్నిస్తుంది.

అధికారులూ...జర దేఖో..!

ప్రస్తుతం బియ్యం విషయంలో జరుగుతున్న బ్లాక్ మార్కెట్ దందా, అడ్డగోలు అధిక రేట్ల విషయంలో సంబంధిత అధికారులు జిల్లా వ్యాప్తంగా కొరడా ఝుళిపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాపారుల అడ్డగోలు అక్రమ దందాకు చరమ గీతం పాడాలని, బియ్యం రేట్లను సామాన్యుడికి అందుబాటులోనికి తేవాలని కోరుతున్నారు. ఈ విషయంలో సంబంధింత అధికారులు తక్షణ చర్యలు చేపట్టి అక్రమ వ్యాపారులపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటారని మనమూ ఆశిద్దాం.

డాక్టర్ కృష్ణ బంటు,
పిహెచ్డ్& గోల్డ్ మెడలిస్ట్ ఇన్ జర్నలిజం,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, రాష్ట్ర ఉత్తమ

చివరికి.. మనిద్దరమే
మిగులుతాం!



జీవితం మొదలయ్యే రోజుల్లో మన చుట్టూ
ఎంతమంది ఉంటారో...
ఇల్లు నవ్వులతో, మాటలతో, సందడితో
నిండిపోతుంది.
పిల్లల అల్లరులు...
బంధువుల రాకపోకలు...
స్నేహితుల సరదాలు...
పండుగల హడావిడి...
మన జీవితాన్ని రంగులతో నింపేస్తాయి.
కానీ...
కాలం తన పని తాను చేసుకుంటూ
ముందుకు సాగుతుంది.
కూతుళ్లు...
పెళ్లి అయి మహాలక్ష్మిలా తమ కొత్త
ఇంటికి వెళ్లిపోతారు.
కొడుకులు...
చదువులు, ఉద్యోగాలు, బాధ్యతలు, పిల్లల
భవిష్యత్తు అంటూ తమ జీవితాల్లో నిమగ్నమైపోతారు.
బంధువులు, స్నేహితులు...
ఎవరి జీవితం వారిది అవుతుంది.
ఫోన్ కాల్స్ తగ్గిపోతాయి...
కలుసుకునే సందర్భాలు అరుదవుతాయి...
ఒకప్పుడు సందడిగా ఉన్న ఆ పెద్ద ఇల్లు...
నెమ్మదిగా నిశ్శబ్దంతో నిండిపోతుంది.
అప్పుడు...
ఒకరి అడుగుల శబ్దానికి మరొకరు ఎదురుచూస్తూ...
ఒకరి దగ్గుకు మరొకరు కలవరపడుతూ...
ఒకరి మందులు మరొకరు గుర్తు చేస్తూ...
ఒకరి ఒంటరితనానికి మరొకరు తోడుగా
నిలుస్తూ...
చివరికి మనిద్దరమే మిగులుతాం!
కాలం మిగిల్చే నిజాలు — ఇప్పుడే
జీవిద్దాం!

1. మాట్లాడుకోవాల్సింది ఇప్పుడే మాట్లాడుకుందాం..
మనసులో మాటలు దాచుకుంటూ కాలం
గడిపేయొద్దు.
రేపు...
చెవులు బలహీనపడవచ్చు!
జ్ఞాపకాలు మసకబారవచ్చు!
చెప్పాలనుకున్న మాటలు... చెప్పకుండానే మిగిలిపోవచ్చు!
కాబట్టి... ఈరోజే మనసు విప్పి మాట్లాడుకుందాం. నవ్వుకుందాం!
గతాన్ని గుర్తుచేసుకుందాం, మన ప్రేమను
మాటల్లో పెట్టుకుందాం.

2. ఒకరికొకరం ఆసరాగా నిలుద్దాం
ఇప్పుడున్న బలం
ఇప్పుడున్న ఆరోగ్యం...
ఇప్పుడున్న సమయం...
ఇవి శాశ్వతం కావు.
చేతిలో బలం ఉన్నప్పుడే కలిసి నడుద్దాం.
పార్కుల్లో కూర్చొని కబుర్లు
చెప్పుకుందాం.
ఒకే కప్పు టీని పంచుకుందాం.
ఎందుకంటే...
రేపు: ఒకరి కళ్లజోడు వెతికేది మరొకరే
ఒకరి చేతికర్ర అందించేది మరొకరే!
కోపాలను ఇక్కడే వదిలేద్దాం జీవితం
చాలా చిన్నది...
అహంకారాలతో...
మాటల యుద్ధాలతో మౌనాలతో
మన మధ్య దూరాలు పెంచుకోవద్దు.
నేను కోపంగా ఉంటే నువ్వు నన్ను
శాంతింపజేయి.
నువ్వు అలిగితే నేను నిన్ను నవ్విస్తాను..
ఎందుకంటే...
చివరికి:
క్షమించుకోవడానికి కూడా మనిద్దరమే
ఉంటాం.

3. ప్రేమను ఇప్పుడే చూపిద్దాం–
వయసు పెరుగుతుంది జుట్టు నెరుస్తుంది
ముఖంపై ముడతలు పడతాయి...
కానీ...
నిజమైన ప్రేమ మాత్రం ఎప్పటికీ ముసలితనాన్ని అంగీకరించదు.
వణికే ఆ చేతులనుపట్టుకుని,
"నేనున్నాను" అని చెప్పే ధైర్యం,
చివరి వరకు నిలిచే ఆప్యాయత అదే
అసలైన దాంపత్యం.

4. సేవ చేయగలిగే ప్రేమే గొప్పది
ప్రేమ అంటే కేవలం:
పూలు ఇవ్వడం కాదు!
మాటలు చెప్పడం కాదు
ప్రేమ అంటే...
తలకు నూనె రాయడం
మందులు సమయానికి ఇవ్వడం
జబ్బు పడితే మంచం పక్కన
కూర్చోవడం..
కాళ్లకు నొప్పి ఉంటే మర్దన చేయడం
వృద్ధాప్యంలో సేవగా మారే ప్రేమే
నిజమైన ప్రేమ.

5. గుండె చప్పుడు వినే తోడుగా ప్రతి
ఉదయం...
కళ్లు తెరిచిన వెంటనే..
"నువ్వు బాగున్నావా?"అని అడిగే మనిషి
ఉండటం అదృష్టం.
నుదుటిపై చేయి వేసి జ్వరం చూసేది
గుండె చప్పుడు విని భయపడేది..
మన కన్నీళ్లను చూసి తట్టుకోలేనిది జీవిత
భాగస్వామి మాత్రమే!

6. సాయంత్రం ఏకాంతంలో నిజమైన
బంధం కనిపిస్తుంది.
పిల్లలందరూ తమ జీవితాల్లో బిజీ అయి
పోయాక...
ఆ నిశ్శబ్దమైన ఇంట్లో..
పాత ఫోటో ఆల్బమ్లు చూస్తూ..
చిన్న చిన్న జ్ఞాపకాలు గుర్తుచేసుకుని
నవ్వుకుంటూ..
ఒకే కప్పు కాఫీని పంచుకుంటూ గడిపే ఆ
క్షణాలే జీవితంలో నిజమైన సంపద.

7.ఆఖరి క్షణంలో కూడా తోడు నిలిచేది
మనిద్దరమే!
జీవిత ప్రయాణం ఎప్పటికైనా
ముగుస్తుంది ఇద్దరిలో ఒకరు
ముందుగా వెళ్లాల్సిన రోజు వస్తుంది.
ఆ రోజు...
కన్నీళ్లు తుడుస్తూ..
వణుకుతున్న చేతిని పట్టుకుని
గుండె నొప్పిని దాచుకుంటూ
"ధైర్యంగా ఉండు. నేను వస్తున్నాను"అని
చెప్పే మనిషి...
జీవిత భాగస్వామి మాత్రమే.
జీవిత సత్యం
సంపాదించిన డబ్బు...
కట్టిన ఇల్లు...
కొన్న కార్లు...
పిల్లలు...
ఇవన్నీ జీవితంలో ఒక భాగమే.
కానీ...
చివరి శ్వాస వరకు
మన నవ్వులను, బాధలను, ఒంటరితనాన్ని పంచుకునే మనిషి...
"జీవిత భాగస్వామి" మాత్రమే.
ఒక చిన్న విజ్ఞప్తి
మీ జీవిత భాగస్వామిని గౌరవించండి
ప్రేమను మాటల్లో చెప్పండి
సమయం కేటాయించండి
చిన్న చిన్న జ్ఞాపకాలను సృష్టించుకోండి...

– మీ శ్రేయోభిలాషి...

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 03.11.2026
www.mudranews.in | @mudranews

పచ్చి గుడ్ల కంటే వండినవే మేలు

పచ్చి గుడ్లతో పోలిస్తే వండిన గుడ్లలోని ప్రోటీన్‌ను శరీరం మరింత సమర్థవంతంగా గ్రహిస్తుంది.
అంతేకాకుండా, పూర్తిగా ఉడికించడం వల్ల సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియా ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



కృష్ణా జలాలున్నా పంటలు ఎండబెట్టారు

రైతుల కన్నీళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం హరీశ్‌రావు

కల్వకుర్తి ఐదు మోటార్లను 24 గంటలు నడపాలి

జూరాల నుంచి మరో 15 రోజులు నీళ్లివ్వాలి

అల్వాల రైతు సభలో ప్రభుత్వానికి నాలుగు డిమాండ్లు..

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



ముద్ర, వనపర్తి: కృష్ణా నదిలో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ సాగునీటిని సకాలంలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఇది ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చిన కరువు కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏర్పడిన కృత్రిమ కరువని ఆరోపించారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా రైతుల పొలాలకు చేరకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో నిర్వహించిన 'రైతన్నల రణబేరి' సభలో హరీశ్‌రావు మాట్లాడారు. అంతకుముందు మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, సి.లక్ష్మారెడ్డి తదితరులతో కలిసి సాగునీరు అందక ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోవడంతో నష్టపోయిన రైతులను పరామర్శించారు. అల్వాల గ్రామానికి చెందిన కొండయ్య అనే రైతు మూడు ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా ఎండిపోయిందని వివరించారు.25 లక్షల ఎకరాల్లో పంట నష్టంఒక్క అల్వాల గ్రామంలోనే సుమారు 250 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా 24 నుంచి 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం ఐదు మోటార్లను పూర్తిస్థాయిలో వినియోగించడం లేదని ఆరోపించారు. కల్వకుర్తి ప్రాజెక్టులో ఐదు మోటార్లను నడిపితే రోజుకు 0.3456 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని, ఐదు నెలల్లో సుమారు 50 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని విమర్శించారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నా పాలమూరు రైతులకు ప్రయోజనం కల్పించలేకపోయారని అన్నారు.ప్రభుత్వానికి నాలుగు డిమాండ్లురైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు నాలుగు ప్రధాన డిమాండ్లు చేశారు.కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఐదు మోటార్లను 24 గంటలపాటు నడిపి అన్ని చెరువులను నింపాలి.పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కాలువకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి నార్లాపూర్ నుంచి కరివేన, వట్టెం రిజర్వాయర్ల వరకు నీటిని నింపాలి.జూరాల నుంచి మరో 15 రోజులపాటు సాగునీటిని విడుదల చేసి చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడాలి.కరువుతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు యాసంగి రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి.అలాగే వ్యవసాయ కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, హార్వెస్టర్ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పనిదినాలను పెంచాలని, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రకటించిన రూ.12 వేల సాయాన్ని విడుదల చేయాలని కోరారు. కరువు మండలాల్లో కేంద్ర బృందం పర్యటించి రైతులకు నష్టపరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల పక్షాన పోరాడుతాంపాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిందని, మిగిలిన పనులను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా సహా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలను లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతంలో వనపర్తి జిల్లా అధికంగా వరి సాగు చేసిన ప్రాంతంగా గుర్తింపు పొందిందని, ప్రస్తుతం పంటలు ఎండిపోవడం ఆందోళనకరమని అన్నారు. రైతులు ప్రతి సీజన్‌లో యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.



బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

రైతు సభ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఎదుల గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల శ్రీనివాస్‌రెడ్డి సుమారు 200 మంది అనుచరులతో, దత్తాయపల్లి సర్పంచ్ దేవేందర్‌నాయుడు, మాజీ సర్పంచ్ రాజునాయక్ సుమారు 150 మంది అనుచరులతో పార్టీలో చేరారు. మాజీ కౌన్సిలర్ లక్ష్మీదేవమ్మ, ఆమె కుమారుడు వినోద్‌గౌడ్ కూడా అనుచరులతో కలిసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలకు హరీశ్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, సి.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, బాను హనుమంతు నాయుడు, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్ విదేశాంగ విధానాన్ని నడిపిస్తోంది ఆ దేశ సైన్యమా?



అవును అంటున్న పాకిస్తాన్ రక్షణ మంత్రి

ముద్ర, న్యూఢిల్లీ: పాకిస్తాన్ విదేశాంగ విధాన నిర్ణయాల్లో ఆ దేశ సైన్యం కీలకపాత్ర పోషిస్తున్నది. ఈ విషయాన్ని ఆ దేశ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ స్వయంగా వెల్లడించారు. పౌర ప్రభుత్వం, సైనిక నాయకత్వం కలిసి అధికారాన్ని పంచుకుంటున్నాయని తెలిపారు. దేశంలో అమలవుతున్నది సంప్రదాయ ప్రజాస్వామ్య పాలన కాదని, ఇది ఒక 'హైబ్రిడ్ వ్యవస్థ' అని చెప్పారు. బ్రిటిష్–అమెరికన్ జర్నలిస్ట్ మెహ్దీ హసన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో సైన్యాధిపతి అసిమ్ మునీర్‌కు ప్రభుత్వ పెద్దలకంటే ఎక్కువ అధికారం ఉందా..? అన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. సైన్యం, పౌర నాయకత్వం మధ్య నిర్ణయాలు ఏకాభిప్రాయంతో జరుగుతాయని చెప్పారు. అయితే అధికార పంపిణీ సమానంగా లేదని అంగీకరించారు. దేశంలో సైన్యం పాత్రను ప్రస్తావిస్తూ.. గతంలో సైనిక పాలకుల కారణంగా ఈ వ్యవస్థ మరింత స్పష్టంగా కనిపించిందని ఆసిఫ్ అన్నారు. అమెరికాలోనూ ప్రభుత్వ నిర్ణయాల వెనుక 'డీప్ స్టేట్' ఉందని వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్‌లో ప్రస్తుతం సైనిక పాలన లేదని, సైన్యం ఎన్నికైన ప్రభుత్వానికి సహకరిస్తోందని ఆయన గతంలో కూడా పలుమార్లు సమర్థించారు. 2025లో అరబ్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఆసిఫ్ పాకిస్థాన్ పాలనా విధానాన్ని 'హైబ్రిడ్ మోడల్' గా అభివర్ణించారు. సైనిక, పౌర నాయకత్వం కలిసి అధికారాన్ని నిర్వహిస్తున్నాయని, ఆర్థిక, పాలనా సమస్యల నుంచి దేశం బయటపడే వరకు ఈ విధానం అవసరమని పేర్కొన్నారు.

జర్మనీలో జెన్‌జీ ఆగ్రహజ్వాలలు..

34 నగరాల్లో నిరసనలు..
ఫ్రాంక్‌ఫర్ట్‌లో లూటీలు!



ముద్ర, ఫ్రాంక్‌ఫర్ట్: జీవన వ్యయం పెరుగుదల, విద్యారంగానికి నిధుల కోత, ప్రభుత్వ ప్రజాసేవలపై ఖర్చు తగ్గింపు, తప్పనిసరి సైనిక సేవ విధానాన్ని వ్యతిరేకిస్తూ జర్మనీలో యువత చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. శనివారం దేశవ్యాప్తంగా 34 నగరాల్లో జరిగిన ఆందోళనల్లో వేలాది మంది పాల్గొన్నారు. ఫ్రాంక్‌ఫర్ట్‌లో ముసుగులు ధరించిన కొందరు దుకాణాలను లూటీ చేయడంతోపాటు, పోలీసులతో ఘర్షణకు దిగారు. అత్యవసర సేవల సిబ్బందిపై పెట్రోల్ బాంబులు విసిరారు. బెర్లిన్, కొలోన్, హాంబర్గ్‌లోనూ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.జర్మనీ ఆర్థిక కేంద్రంగా పేరొందిన ఫ్రాంక్‌ఫర్ట్‌లో నిరసనలు రాత్రివేళ హింసాత్మకంగా మారాయి. కనీసం రెండు దుకాణాలను లూటీ చేయగా, మరికొన్ని దుకాణాల అద్దాలను ధ్వంసం చేశారు. దాడులకు గురైన వాటిలో తుపాకుల విక్రయశాల కూడా ఉంది. షాపింగ్ ప్రాంతాల్లో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. నిరసనకారులు రాళ్లు, బాణసంచా, పెట్రోల్ బాంబులతో దాడులకు దిగడంతో పోలీసులు జల ఫిరంగులు, పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. ఘర్షణల్లో పలువురు పోలీసులు గాయపడ్డారు.హాంబర్గ్‌లో నిరసనకారులు కొన్ని బారికేడ్లకు నిప్పంటించారు. కొలోన్‌లోనూ అత్యవసర సేవల సిబ్బందిపై దాడులు జరిగినట్టు అధికారులు తెలిపారు. బెర్లిన్‌లో మరో నిరసన సందర్భంగా పోలీసులపై గుడ్లు, సీసాలు విసిరినట్టు పోలీసులు వెల్లడించారు. అయితే, పగటిపూట జరిగిన ప్రదర్శనల్లో ఎక్కువభాగం ప్రశాంతంగానే సాగాయి.

విద్య, వైద్య రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్

జెన్‌జీ రెగెల్ట్ అనే ప్రచార బృందం ఈ నిరసనలకు పిలుపునిచ్చింది. విద్య, వైద్య రంగాలకు మరిన్ని నిధులను కేటాయించాలని, ప్రజాసేవలను మెరుగుపరచాలని, పెరుగుతున్న జీవన వ్యయాన్ని తగ్గించాలని యువత డిమాండ్ చేసింది. తప్పనిసరి సైనిక సేవ విధానాన్ని కూడా వ్యతిరేకించింది. బెర్లిన్‌లో జరిగిన సభలో ఉద్యమ ప్రతినిధి లీనా ఫ్రెడ్రిక్ మాట్లాడుతూ.. యుద్ధం, బలవంతపు విధానాలకు బదులుగా శాంతి, స్వేచ్ఛ కోసం తాము పోరాడుతున్నామని చెప్పారు. ఆరోగ్య, విద్యా వ్యవస్థలకు మెరుగైన మద్దతు ఇవ్వాలని, ఆర్థిక భారాన్ని సమానంగా పంచాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని 18 ఏండ్ల యువకుడు స్టీవ్ విమర్శించాడు. ఖర్చులను తగ్గించే పేరుతో ప్రజా సేవలకు నిధుల కోత విధిస్తూ, యువతపై మరింత భారం మోపుతున్నదని ఆరోపించాడు. తమ సమస్యలకు పరిష్కారం చూపే వరకు నిరసనలను కొనసాగిస్తామని తెలిపాడు. బెర్లిన్ టెక్నికల్ యూనివర్సిటీ విద్యార్థి బేకర్ కూడా విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. యూనివర్సిటీలోని కొన్ని గదులు నిర్లక్ష్యానికి గురైన భవనాల్లా కనిపిస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో చదువుకోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశాడు.

ఐరోపా వ్యాప్తంగా యువజన ఉద్యమాలు

జర్మనీలో జరిగిన ఆందోళనలు ఐరోపాలో కొనసాగుతున్న యువజన నిరసనల పరంపరలో భాగంగా మారాయి. ఫ్రాన్స్, ఇటలీ, సెర్బియా సహా పలు దేశాల్లో యువత ప్రభుత్వ విధానాలు, జీవన వ్యయం, విద్య, ప్రజా సేవల నాణ్యత వంటి అంశాలపై ఆందోళన చేపడుతున్నది. ప్రజాసేవలకు తగిన నిధులు కేటాయించడం, యువతపై ఆర్థిక భారం తగ్గించడం, సైనిక విధానాలపై స్పష్టత ఇవ్వడం వంటి డిమాండ్లతో జర్మనీలో ప్రారంభమైన నిరసనలు హింసాత్మక ఘటనలకు దారితీయడంతో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి.

ఇరాన్‌పై పేజర్ ఆపరేషన్ తరహా దాడి!

ముద్ర, వాషింగ్టన్: ఇరాన్‌లోని ఉన్నత సైనిక, భద్రతా నాయకత్వం లక్ష్యంగా 2024లో హెజ్బొల్లాపై జరిపిన పేజర్ దాడి తరహాలో ఒక రహస్య ఆపరేషన్‌ను నిర్వహించాలని ఇజ్రాయెల్ యోచిస్తున్నది. ప్రధానంగా ఇరాన్ ఉన్నత సైనిక కమాండర్లను ఈ ఆపరేషన్ ద్వారా తొలగించి, ప్రస్తుతం అనిశ్చితిలో ఉన్న దేశ యుద్ధకాలపు సైనిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయాలని భావిస్తున్నది. యూఎస్ మధ్యంతర ఎన్నికల తర్వాత టెహ్రాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు పునరుద్ధరిస్తారని ప్రచారం జరుగుతున్న క్రమంలో ఇజ్రాయెల్ ఈ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.


10 నిమిషాల్లో మీ అణుశక్తిని అంతం చేస్తాం

ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

ముద్ర, ఫ్లోరిడా: ఇరాన్ అణు శక్తిని 10 నిమిషాల్లో అంతం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. శనివారం ఫ్లోరిడాలోని తన ఇంట్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'మేం వాళ్ల అణు సామర్థ్యాన్ని నిర్వీర్యం చేశాం. ఇంకా ఒకటి లేదా రెండు స్థావరాల విషయంలో చర్య తీసుకోవాల్సి ఉంది. ఆ పని పూర్తి చేయడానికి మాకు పది నిమిషాలు చాలు' అని అన్నారు. ఈ వారంలో ఇరాన్‌పై తాము దాడి చేసే అవకాశం ఉందన్నారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని.. అయితే వాళ్లు అంత నమ్మదగినవారు కాదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమకు ప్రమాదం ఏర్పడితే వెంటనే అమెరికా, ఇజ్రాయెల్‌పై దాడి చేస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హెచ్చరికపై ఆయన ఇలా స్పందించారు.

మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే


మిస్టర్ వీటోగా మారుతా



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

ముద్ర, న్యూయార్క్: ఇరాన్ తో యుద్ధం, ప్రపంచ దేశాలతో ఘర్షణల నేపథ్యంలో అమెరికా లో అధికశాతం ప్రజలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను వ్యతిరేకిస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే.. తాను 'మిస్టర్ వీటోగా మారాల్సి రావచ్చని పేర్కొన్నారు. వారి అధికారాలను నియంత్రించేందుకు వీటో పవర్ ను వినియోగిస్తానని చెప్పారు. ఎన్నికల్లో డెమోక్రాట్‌లు గెలిచి కాంగ్రెస్‌పై పట్టు సాధిస్తే వారుచేసే బిల్లులను ఆమోదించకుండా అన్నింటినీ తిరస్కరిస్తానని ట్రంప్ అన్నారు. ఒకటి రెండు నెలలపాటు అలాచేస్తే చివరికి వారే తన దగ్గరికి వచ్చి ఒప్పందం చేసుకోవాలని చూస్తారని, అయితే అవన్నీ వృథా ప్రయత్నాలే అవుతాయని ట్రంప్ అన్నారు. తన పాలనలో చరిత్రలోనే అత్యుత్తమ ఆర్థికవ్యవస్థగా అమెరికా ఎదిగిందని పేర్కొన్నారు. రీపబ్లికన్‌లకు వచ్చే ఓట్లను సర్వేలు సరిగా చూపించట్లేదని అసహనం వ్యక్తంచేశారు. అవకాశం వస్తే మరోసారి అధ్యక్ష స్థానానికి పోటీ చేయడానికీ తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు.అయితే రాజ్యాంగ నిబంధనలు కఠినంగా ఉండడంవల్ల అది సాధ్యం కాకపోవచ్చని ట్రంప్ నిరాశ వ్యక్తంచేశారు. తన ప్రత్యర్థులపై గూఢచర్యం చేయడంలో చైనా, రష్యా కంటే మెరుగ్గా అమెరికా పనిచేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా సైనిక స్థావరాలపై చైనా, రష్యా గూఢచర్యం చేస్తున్నాయని నిఘా అధికారులు తనకు చెప్పిన విషయాన్ని ట్రంప్ గుర్తు చేసుకున్నారు. వారి మాదిరిగానే వాషింగ్టన్ కూడా బీజింగ్, మాస్కోలను నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. ఆ విషయం గురించి భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు.చైనా ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరించడానికి కుట్ర పన్నినందుకుగానూ అక్టోబర్ 30న లిరెన్, యువాన్స్ చెన్ అనే ఇద్దరు చైనా జాతీయులకు అమెరికా న్యాయశాఖ 30 నెలల జైలుశిక్ష విధించింది. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన వెంటనే ఇరాన్‌పై దాడులు ప్రారంభించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కోరారు. అయితే ఆ దేశంతో ఒప్పందం చేసుకోవడానికి ప్రస్తుతం శాంతి చర్చలు కొనసాగించాలని తాను భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

ట్రంప్ నివాసానికి సమీపంలో కుప్పకూలిన ప్రైవేట్ జెట్.. తొమ్మిది మంది మృతి



ముద్ర, ఫ్లోరిడా: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఫ్లోరిడాలోని ట్రంప్ నివాస ప్రాంతానికి సమీపంలో ఓ ప్రైవేట్ జెట్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా స్థానిక కాలమాన ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనతో భారీగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సహాయక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదం నేపథ్యంలో సమీప రహదారులను మూసివేశారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వివరాల ప్రకారం.. లియర్‌జెట్ 60 విమానం టెక్సాస్‌లోని ఆస్టిన్–బెర్గ్ స్ట్రోమ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలు దేరి బహామాస్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో ఫ్లోరిడాలోని క్రెస్ట్‌హేవెన్ ప్రాంతంలో నేలపైకి దూసుకొచ్చి కూలిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన మార్–ఎ–లాగో నివాసానికి ఈ ప్రాంతం సుమారు తొమ్మిది మైళ్ల దూరంలో ఉంది.కాగా, ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విమానం ఆకాశం నుంచి వేగంగా కిందికి దూసుకొచ్చి రహదారి సమీపంలో కూలిన వెంటనే భారీ పేలుడు సంభవించినట్లు ఆ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఘటనాస్థలంలో దట్టమైన నల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడింది. ఈ ప్రమాదంపై ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ స్పందించారు. విమానం కూలిన దృశ్యాలు చూస్తే అది క్షిపణిలా కిందికి దూసుకొచ్చినట్లు ఉందని, భారీ పేలుడుతో శకలాలు అన్ని వైపులా ఎగిరిపడ్డాయని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 3.11.2026
www.mudranews.in | @mudranews

జిమ్ చేసేవారికి గుడ్లు మంచి ఆహారం

కండరాల నిర్మాణం, శరీరానికి అవసరమైన పోషకాల కోసం గుడ్లు మంచి ప్రోటీన్ వనరు. జిమ్ చేసేవారైనా, సాధారణ వ్యక్తులైనా తమ రోజువారీ ఆహారంలో గుడ్లను చేర్చుకోవచ్చు.



గ్లోబల్ సప్లై చైన్‌తో స్థానిక పరిశ్రమల అనుసంధానం

ప్రతి జిల్లాను ఆర్థిక ప్రగతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్‌బాబు

ఎఫ్‌టీఏల ద్వారా లభించే అంతర్జాతీయ వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకునేలా పరిశ్రమలకు మార్గనిర్దేశం



ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలోని స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలోని ప్రతి జిల్లాను ప్రత్యేక ఆర్థిక ప్రగతి కేంద్రంగా (గ్రోత్ ఇంజన్) అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం టీ-హబ్‌లో నిర్వహించిన "మెగా ఎఫ్‌టీఏ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్"కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో ఎగుమతులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ అవకాశాలను వినియోగించుకునేలా రాష్ట్రంలోని పరిశ్రమలు, ఎగుమతిదారులు, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) అవసరమైన మార్గనిర్దేశం అందిస్తామని తెలిపారు."మేడ్ ఇన్ తెలంగాణ" ఉత్పత్తులను ఎఫ్‌టీఏ భాగస్వామ్య దేశాల మార్కెట్లకు విస్తరించడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులను గుర్తించి, వాటి తయారీ, ప్రాసెసింగ్‌తో పాటు ఎగుమతులను ప్రోత్సహిస్తామని వివరించారు. దేశీయ ఆహార అవసరాలు తీర్చిన అనంతరం మిగిలే వ్యవసాయ ఉత్పత్తులు వృథా కాకుండా వాటిని ఎగుమతులకు మళ్లించాల్సిన అవసరం ఉందని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. ఎఫ్‌టీఏల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా కేంద్ర ప్రభుత్వం మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, వివిధ జిల్లాల కలెక్టర్లు మను చౌదరి, ప్రియాంక ఆలా, కుష్బూ గుప్తా, అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

'మట్టి పరిమళాలు' వీడియో పాటలు

ఏఐకేఎస్ మహాసభల ప్రచారంలో జూలకంటి చేతుల మీదుగా ఆవిష్కరణ



ముద్ర, నల్గొండ : అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా ప్రజానాట్యమండలి, టి10 మల్టీచానల్ నెట్ వర్క్ సంయుక్తంగా రూపొందించిన 'మట్టి పరిమళాలు – రైతాంగ పోరు గీతాలు' వీడియో పాటలను మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సోమవారం నల్గొండలో ఆవిష్కరించారు. రైతాంగ ఉద్యమ చరిత్ర, వ్యవసాయ సంక్షోభం, రైతుల సమస్యలు, హక్కుల పోరాటాలు, కనీస మద్దతు ధర వంటి డిమాండ్లను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ పాటలను రూపొందించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలు, హక్కుల పోరాటాలను ప్రజలకు చేరవేయడంలో పాటలు శక్తివంతమైన మాధ్యమాలని అన్నారు. ఉద్యమాలు సభలు, సమావేశాలకే పరిమితం కాకుండా కళలు, సాహిత్యం, సంగీతం ద్వారా అన్ని వర్గాలకు చేరాలని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రకు సాక్షిగా నిలిచిన నల్గొండలో జాతీయ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమని అన్నారు.తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధరలు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ సాధించేందుకు ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా, డిజిటల్ మాధ్యమాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు.సోషల్ మీడియా రాష్ట్ర ఇన్ చార్జి బండారు రవికుమార్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ వీడియో పాటలను యువతకు చేరువ చేయాలని, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. రైతాంగ పోరాట చరిత్రను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడం అవసరమని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ పేర్కొన్నారు.

కార్యక్రమానికి టి10 సీఈఓ సుందర్ అధ్యక్షత వహించగా, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జె. వినోద్, కట్టా నర్సింహ, సంగీత దర్శకుడు ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం బాధ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వి వెంకటేశ్వర్లు, భూపాల్, శ్రీరామ్ నాయక్, ఆశయ్య, వెంకటేష్, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డి మల్లేశం, ప్రమీళ, పాలడుగు నాగార్జున, సయ్యద్ ఆశం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మి నారాయణ, ఐత విజయ్, అనగంటి వెంకటేష్, కోట రమేష్, టి నాగరాజు, రజినీ కాంత్, మమత, పుచ్చకాయల నర్సిరెడ్డి, కె శంకర్, డి. రామకృష్ణ, ఆదేష్, సలీం, సత్తయ్య, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ చేతగానితనంతోనే రాష్ట్రంలో కరువు

- హరీశ్ రావు - కల్వకుర్తి మోటార్లను 24 గంటలు నడపాలి..
- జూరాల నుంచి మరో 15 రోజులు నీళ్లివ్వాలి

ముద్ర, వనపర్తి : రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో సాగునీరు అందక ఎండిపోయిన పంట పొలాలను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన రైతు సభలో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 50 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 18 టీఎంసీలే వాడుకున్నారని, మిగిలిన నీటిని దిగువకు వదిలేశారని మండిపడ్డారు. కల్వకుర్తి ప్రాజెక్టులోని ఐదు మోటార్లను 24 గంటల పాటు నడపాలని, జూరాల నుంచి మరో 15 రోజుల పాటు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కాలువల్లో అడ్డంకులను తొలగించి రిజర్వాయర్లను నింపాలని కోరారు. ఎండిపోయిన 25 లక్షల ఎకరాల పంటలకు వెంటనే పరిహారం చెల్లించాలని, యాసంగి రైతుబంధు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని తెలంగాణకు పంపించాలని కోరారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కరీంనగర్ కలెక్టరేట్ ప్రజావాణికి 287 దరఖాస్తులు

ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 287 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 160, కరీంనగర్ కార్పొరేషన్‌కు 45, మైన్స్‌కు 25 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ చిత్రా మిశ్రా, డీఆర్ఓ స్వామి బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

దేశాన్ని బీజేపీ 'అదానీ'కరణ చేస్తోంది

- పొన్నం ప్రభాకర్

ముద్ర, హైదరాబాద్: కాంగ్రెస్‌ను విమర్శించడానికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన పరిమితమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ విభజన హామీలపై ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చొరబాటుదారుల ఓటు హక్కుకు తాము వ్యతిరేకమన్న ఆయన.. కాంగ్రెస్‌పై భాజపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోందన్నారు. '' దేశంలో ఏపీ (అంబానీ, అదానీ) ట్యాక్స్ నడుస్తోంది. ముగ్గురు గుజరాతీయుల కోసమే మోదీ, అమిత్ షా పని చేస్తున్నారు. అన్నీ అదానీకి కట్టబెడుతున్నారు.. దేశాన్ని 'అదానీకరణ' చేస్తున్నారు. మీ హామీల గురించి బహిరంగ చర్చకు మీ రాష్ట్ర నాయకత్వం సిద్ధమా? ఎల్‌నినో ప్రభావం, కరవుపై కేంద్రం సహాయం చేయాలి. పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్‌ఐఆర్‌పై చర్చ చేపట్టాలి'' అని పొన్నం డిమాండ్ చేశారు.

ఘనంగా యజ్ఞవరాహస్వామి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు



ముద్ర, కరీంనగర్ : కరీంనగర్‌లోని ప్రసిద్ధ శ్రీ యజ్ఞవరాహస్వామి వారి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు ఆరు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించారు. అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో శ్రీవసుధాలక్ష్మీ యజ్ఞం, హనుమంత వాహన సేవ, ప్రత్యేక పూజలు, స్వామివారి కల్యాణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.చివరి రోజు సోమవారం స్వామివారికి రథోత్సవం, చక్రస్నానం, వసంతోత్సవం, పూర్ణాహుతి, శ్రీపుష్ప యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.సీ.ఎన్ కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



అమిత్‌షాను కలిసిన చిరంజీవి, రామ్ చరణ్

ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమిత్ షా బస చేసిన హోటల్ ఐటీసీకి వెళ్లి ఆయనతో కాసేపు మాట్లాడారు. శాలువాతో సత్కరించి.. జ్ఞాపికను బహూకరించారు. భాజపా మహాపాదయాత్రలో పాల్గొనేందుకు అమిత్ షా హైదరాబాద్ వచ్చిన సంగతి తెలిసిందే.



చిగురుమామిడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



*** బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి డిమాండ్..**
*** తహసిల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ మహాధర్నా..**
*** మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్...**
*** దశాబ్దాల మెట్ట ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడం దారుణమని ఆవేదన...**
*** ప్రకృతి కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ నాయకుల ఆగ్రహం...**

ముద్ర చిగురుమామిడి: దశాబ్దాల కాలంగా కరువుతో అల్లాడుతున్న చిగురుమామిడి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం మహాధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న చిగురుమామిడి మండలంలో ఇంతటి తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా,ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.దశాబ్దాలుగా మెట్ట ప్రాంతంగా ఉన్న ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు న్యాయం చేయలేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మండలంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి ఇచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం వల్ల తెచ్చిన కరువు అని వారు స్పష్టం చేశారు.చిగురుమామిడి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని,మండలానికి కరువు సహాయం కింద పెద్ద ఎత్తున ప్రత్యేక నిధులు మంజూరు అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కనకయ్యకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి,సర్పంచ్ బోయిని రమేష్,మాజీమండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి,మాజీసర్పంచ్ లు సన్నీల్ల వెంకటేష్,బెజ్జంకి లక్ష్మణ్,మాజీ ఎంపీటీసీ సభ్యులు మిట్టపల్లి మల్లేశం,కత్తుల రమేష్ యాదవ్, పెసరి రాజేశం,హనుమండ్ల సత్యనారాయణ,బుర్ర తిరుపతి గౌడ్,ఎస్ కే సిరాజ్,ఉపసర్పంచ్ లు మేడబోయిన రాజు,కాసర్ల హరీష్,కాశబోయిన రాజు యాదవ్,శ్యామకూర సంపత్ రెడ్డి,నాగేల్లి రాజిరెడ్డి,చెప్యాల నారాయణరెడ్డి,తాటికొండ సందీప్ రెడ్డి,కత్తుల ప్రశాంత్,అంజిరెడ్డి,సిద్దెంక్కి రాయమల్లు,తోట శ్రీనివాస్,చెరుకు సంజీవ్,కిష్టారెడ్డి,వార్డ్ సభ్యుడు లక్ష్మయ్య,పరిపాటి రవీందర్ రెడ్డి, బండారి మల్లేశం,పాండావుల సంపత్,మ్యాదరవేణి ప్రవీణ్ యాదవ్,బిళ్ళ చంద్రరెడ్డి,మహంకాళి కొమురయ్య,కాలువల సంపత్ రెడ్డి,మల్లికార్జున్,షరీఫ్,చెరుకు హరీష్,సతీష్,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సింగరేణికి జాతీయ స్థాయిలో మరో ఘనత..

- ఐదు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు
- కేంద్ర మంత్రి సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి
-సింగరేణి అధికారులు, కార్మికులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు



ముద్ర, హైదరాబాద్ : దేశంలోని అత్యుత్తమ బొగ్గు గనుల నిర్వహణలో సింగరేణి కాలరీస్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సింగరేణి సంస్థకు చెందిన ఐదు బొగ్గు గనులు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను సాధించాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో సోమవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అవార్డులను స్వీకరించారు.

అవార్డులు సాధించిన ఐదు గనులు

సింగరేణికి చెందిన ఐదు గనులు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును పొందాయి.

1. శ్రీరాంపూర్ ఏరియా – ఆర్‌కేఎన్‌టీ గని.
2. శ్రీరాంపూర్ ఏరియా – ఆర్‌కే-6 ఇంక్లైన్.
3. సత్తుపల్లి ఏరియా – జేవీఆర్ ఓసీ-2.
4. బెల్లంపల్లి ఏరియా – ఖైరీగూడ ఓసీ.
5. రామగుండం-3 ఏరియా – ఆర్‌జీఓసీ-1.

84 అంశాల ఆధారంగా మూల్యాంకనం

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం దేశంలోని అత్యుత్తమ బొగ్గు గనులకు స్టార్ రేటింగ్‌లను ప్రకటిస్తుంది. గనుల పనితీరు, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలు తదితర మొత్తం 84 అంశాలను పరిగణనలోకి తీసుకుని మూల్యాంకనం నిర్వహిస్తారు. కేంద్ర బొగ్గు శాఖకు చెందిన పరిశీలక బృందాలు గనులను ప్రత్యక్షంగా సందర్శించి ప్రమాణాలను పరిశీలిస్తాయి. మొత్తం 100 మార్కులకు గాను 91 కంటే ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ప్రదానం చేస్తారు. ఈ ప్రమాణాలన్నింటిలో ప్రతిభ కనబరిచి సింగరేణికి చెందిన ఐదు గనులు జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం విశేషం.

కార్మికులకు సీఎండీ అభినందనలు

ఐదు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ రావడంపై సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. గనుల యాజమాన్యాలు, అధికారులు, కార్మికులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాతీయ అవార్డులు సాధించేలా నాణ్యమైన పనితీరు కనబరచాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

భట్టి విక్రమార్క అభినందనలు

సింగరేణిలో ఐదు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని ఆకాంక్షించారు.

ప్రముఖుల హాజరు

ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝా, కోల్ కంట్రోలర్ సతీష్ కుమార్, కోల్ ఇండియా సీఎండీ సాయిరాం, సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. మధుసూదన్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా ఏజీఎం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 03.11.2026
www.mudranews.in | @mudranews

ఆమ్లెట్‌తో క్యాలరీలు పెరిగే అవకాశం

గుడ్లతో ఆమ్లెట్ తయారు చేసుకునేటప్పుడు నూనె, వెన్న, పాలు వంటివి కలిపితే క్యాలరీలు పెరుగుతాయి. అయితే గుడ్డులోని అసలు ప్రోటీన్ పరిమాణం మాత్రం పెద్దగా మారదు.



అంగరంగ వైభవంగా నిత్య కళ్యాణోత్సవం





స్వర్ణ గిరి విద్య క్షేత్రంలో సోమవారం విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆదిమధ్యాంతరహితుడైన స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు. అనంతరం స్వామి వారు సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శన మిచ్చారు. వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కావాలి



మాజీ మంత్రి పువ్వాడ అజయ్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 2 : రాష్ట్రంలో ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు ప్రకృతి తెచ్చినవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థత లేకపోవడం వల్ల వచ్చిన "చేతకాని తనపు కరువు" అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వ వైఫల్యాలు మరింత స్పష్టంగా బయటపడతాయని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావడం ఖాయమని అన్నారు. కేడర్ అంతా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పిలుపునిచ్చిన వెంటనే ప్రజాపోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు.ఖమ్మం నియోజకవర్గంలో నిర్వహించిన పలు సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించడానికి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ నేరుగా వెళ్లి అర్హులైన ప్రతి పట్టభద్రుడి వివరాలను సేకరించాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఓటర్ ఐడి, మొబైల్ నంబర్లతో దరఖాస్తులు పూర్తి చేయించి, కేసీఆర్ ప్రత్యేకంగా రూపొందించిన 'పార్టీ యాప్' ద్వారా వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నాయకులు ఎలాంటి అలసత్వం వహించకుండా మిగిలిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బచ్చు విజయ్ కుమార్, నాగండ్ల కోటేశ్వరరావు, దండా జ్యోతి రెడ్డి, కూరాకుల వలరాజు, కొనకంచి ప్రసాద్, వల్లభనేని రామారావు, వీరు నాయక్, మద్దినేని వెంకటరమణ, గుత్తా రవి, హరిప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, లక్ష్మణ్ నాయక్, యాస రామారావు, పెంట్యా, శంకర్, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 158 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటిక ప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 102,హౌసింగ్ 12,ఉపాధి కల్పన 7, ఎస్సీ కార్పొరేషన్ 5, గ్రామీణ అభివృద్ధి శాఖ 4,సర్వే ల్యాండ్స్ 4, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, మండల పరిషత్ 3, విద్య 2, వైద్య ఆరోగ్య 2, మున్సిపాలిటీ 2, పంచాయతీ 2, మైన్స్, విద్యుత్, సివిల్ సప్లై, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఈ.డి. ఎం , వ్యవసాయ, సంక్షేమ , ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణా రెడ్డి ,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగి రెడ్డి,డిప్యూటీ కలెక్టర్ సాత్విక్,జెడ్పీ సీఈఓ



శోభా రాణి, డి.పి.ఓ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో 104 అర్జీలు

ముద్ర ప్రతినిధి, సూర్యాపేట, నవంబరు 2: ప్రజావాణిలో మొత్తం 104 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. అధికారుల లాగిన్‌లలో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల అధికారులు తప్పని సరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్థానికంగా పరిష్కరించగలిగే సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలకు సమయం, వ్యయ ప్రయాసలు తగ్గుతాయని పేర్కొన్నారు. వీటిలో భూ, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 50, డీపీఓకు 6, పీడీ హౌసింగ్‌కు 6, డీడబ్ల్యూఓకు 5, డీఈఓకు 5, ఇతర శాఖలకు సంబంధించి 32 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఈఓ శ్రీనివాస్, డీఎస్ఓ మోహన్‌బాబు, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, సీపీఓ కిషన్, సీఫ్ఓ దామోదర్‌రెడ్డి, డీఐఈఓ సులోచనారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్‌రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనం 18 వేలకు పెంచాలి



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు అంగన్వాడీలకు నెలకు రూ.18 వేల వేతనం, రూ.10 వేల రిటైర్మెంట్ పెన్షన్ వెంటనే అమలు చేయాలని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు సింగ్ నరసింహారావు, యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సి.హెచ్. సీతామాలక్ష్మి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రీ–ప్రైమరీ స్కూల్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. టీచర్లకు ఇబ్బందికరంగా మారిన బీఎల్ఓ విధులు, అదనపు పనులను తొలగించి, పెండింగ్ రిటైర్మెంట్ బెనిఫిట్లు, బకాయిలు చెల్లించాలని కోరారు. గర్భిణులు, బాలింతలకు మెనూ ఛార్జీలు పెంచి, సరుకుల టెండర్ విధానం రద్దు చేయాలన్నారు. పిఎఫ్, ఈఎస్ ఐ హెల్త్ కార్డ్‌లతో పాటు రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, సమ్మె కాలపు వేతనాలు విడుదల చేసి అక్రమ కేసులు ఎత్తివేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు గాదె లక్ష్మీనారాయణ, సిహెచ్ ఝాన్సీ రాణి, ఎస్కె హస్నాభి తదితరులు పాల్గొన్నారు.

15న నల్గొండలో రైతు బహిరంగ సభ



ముద్ర, బీజీనగర్ : ఈనెల 15 నుండి 18 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కేంద్రమైన నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత రైతు సంఘం (ఏఐకెఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఎం పట్టణ కమిటీ సమావేశం స్థానిక రహదారి బంగ్లాలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పొట్ట కొట్టే నల్ల చట్టాలను తీసుకొచ్చి బలవంతంగా రైతాంగం పై రుద్దాలని ప్రయత్నం చేసిన రైతు ఉద్యమాలు ప్రభుత్వం మెడలు వంచి రైతులు తమ హక్కులను కాపాడుకోవడంలో విజయం సాధించారని అన్నారు. దేశంలో రైతు ఉద్యమం, ఇతర ప్రజా సంఘాల ఉద్యమాలకు మార్గదర్శకం అయ్యాయని, రైతులు చేసిన పోరాటం ప్రస్తుతం అన్నిప్రజా సంఘాలు అనుసరించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాయని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తుంటే కరువు నివారణ చర్యలు తీసుకోకుండా రైతాంగం పట్ల కనీసం చిత్తశుద్ధి లేకుండా ఆలోచన చేయకుండా ఉందని కరువుతో రాష్ట్రమంతా అల్లాడుతుంటే మూసి సుందరీకరణను ముందుకు తీసుకోవడం తెలంగాణలో రైతాంగం పట్ల, తెలంగాణ ప్రజల పట్ల కాంగ్రెస్ పార్టీకి కనీసం చిత్తశుద్ధి లేదని అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐక్యం చేసే విధంగా వివిధ రూపాలలో పోరాటాలను నిర్మించుకోవడంలో ఈ మహాసభ కర్తవ్యాలను నిర్ణయించుకుంటుందని అన్నారు. నవంబర్ 15న పెద్ద ఎత్తున రైతు బహిరంగ సభ నిర్వహిస్తున్నందున ఈ బహిరంగ సభను రైతాంగం, కార్మికులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, పట్టణ కమిటీ సభ్యులు దండబోయిన శ్రీశైలం, పంజాల జంగయ్య, కుమ్మరి రాజు, పాశం బాలయ్య, ఓవల్ దాస్ శంకర్, చెట్టబోయిన కనకయ్య పాల్గొన్నారు.

సమాధుల తోటలో ఆల్ సోల్స్ డే ప్రార్థనలు



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ సీఎస్ఐ చర్చి ఆవరణలోని సమాధుల తోటలో ఆల్ సోల్స్ డే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమం సంఘ ప్రెసిబిటర్ ఇన్‌చార్జి గురువు డాక్టర్ శాంతయ్య ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆల్ సోల్స్ డే అనేది మరణించిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను స్మరించుకునే పవిత్ర మైన రోజని తెలిపారు. వారు మనకు అందించిన ప్రేమ, ఆప్యాయత, సేవా భావం, మంచి బోధనలు ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ జీవించి ఉన్నప్పుడే ఇతరుల పట్ల ప్రేమ, దయ, క్షమాగుణం చూపిస్తూ మంచి పనులు చేయాలని సూచించారు. దేవునిపై విశ్వాసంతో జీవిస్తూ ప్రార్థన, సేవ, పరస్పర ప్రేమ ద్వారా క్రైస్తవ విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపు నిచ్చారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యాన్ని, మన శ్శాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.అనంతరం సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సంఘ గురువులు రెవ. డేవిడ్ రిచర్డ్స్, రెవ. శ్రీనివాస్, రెవ. జైపాల్, రెవ. వసంతరావు, సంఘ కార్యదర్శి గెలన్, బాధ్యులు గంట సంపత్(కౌన్సిలర్), ప్రభుదయ, దేవా ప్రకాష్, కమిటీ సభ్యులు జాయ్ మ్రే, సునీల్, జీసీ ఫ్రాంక్ జాన్సన్, లిల్లీ గ్రేస్, సుశీల్, సువన్, శాంసన్, సురేందర్, ప్రభుదాస్, జాన్ వెస్లీ, అనంతరావు, సుమమాల, శ్రీనివాస్, బి. సునీల్, వికాస్, సంఘ సభ్యులు నోబెల్ సాన్, ప్రభుదయ చరణ్, పద్మారావు, మంగ ప్రశాంత్, జీవన్, రోహన్ తదితరులు పాల్గొని ప్రార్థనల్లో భాగస్వాములయ్యారు.

కవితక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 2 : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్ తీవ్రంగా ఖండించారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని, ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ కవితక్క పేదలు, ఉద్యోగులు, పీడిత వర్గాల సమస్యలపై పోరాడుతున్నారని చెప్పారు. కవితక్క ఎవరి బాణం కాదని, బహుజనుల బాణమని స్పష్టం చేసిన ఆయన ఇకపై ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నాయకులు బానోత్ కిషన్ నాయక్, మొరం వీరభద్రరావు, వనం నాగేంద్ర, గుగులోత్ రాజ్ కుమార్, జక్కుల ప్రకాష్ యాదవ్ పాల్గొన్నారు.

పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేస్తా



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పట్టణంలో ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా చేస్తామని, ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడాలని మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణం 30వ వార్డు పహడినగర్ లో మున్సిపల్ కౌన్సిలర్ ఎండీ. లయిక్ అహ్మద్ ఆధ్వర్యంలో 3 నూతన బోర్లను ఆమె ప్రారంభించారు. వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్ మాట్లాడుతూ పహడినగర్ లో చాలా కాలంగా ఉన్న మంచినీటి సమస్యను తీర్చడానికి కౌన్సిలర్ లయిక్ అహ్మద్ ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాశ్ రెడ్డి, మున్సిపల్ డీఈఈ, ఏఈఈ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎండి షరీఫ్, ఎండీ.జబ్బార్, ఎం.డి. కామిల్, ఎం.డి. సల్మాన్ ఖాన్, వస్తువుల సాయి, వాటర్ సప్లై లైన్ మెన్ జి. ప్రతాప్ పాల్గొన్నారు.

యువతను వ్యసనాలకు దూరంగా ఉంచాలి

కలెక్టర్ దివాకర టిఎస్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 2 : యువతను పొగాకు, మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా 60 రోజుల పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, సిఒటిపిఏ–2003 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యసనాల భారిన పడిన వారికి కౌన్సెలింగ్, వైద్య చికిత్స, పునరావాస సేవలు అందించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేయాలని కలెక్టర్ దివాకర టి.ఎస్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి విద్యుత్ పొదుపు అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు చేసిన విద్యుత్తు ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో సమానమని, అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు, టీవీలు ఆఫ్ చేయాలని సూచించారు.విద్యుత్ పొదుపునకు బీఈఈ స్టార్ రేటింగ్ పరికరాలు, సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాలని, వేసవిలో ఏసీ ఉష్ణోగ్రతను 25 డిగ్రీలుగా ఉంచాలని తెలిపారు. 'లైఫ్ మిషన్'లో భాగంగా పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేయించి, గోడప్రతిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

డీఎస్పీ శివరాం రెడ్డి

ముద్ర, నల్లగొండ, నవంబర్ 02 : రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం ప్రాణదానంతో సమానమని నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి అన్నారు. సమాజ సేవలో భాగంగా యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోమవారం కట్టంగూర్ లో నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ 7వ జిల్లా మహాసభల రెండవ రోజు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 03.11.2026
www.mudranews.in | @mudranews

ఉడికించిన గుడ్లతో ఆరోగ్యం

రోజూ ఉడికించిన గుడ్లు తినడం మంచి అలవాటు. వీటిలో అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్ లభించడంతో పాటు అదనపు నూనె, కొవ్వు పదార్థాల అవసరం ఉండదు.



విద్యార్థులు భవిష్యత్తులో నాయకులుగా ఎదగాలి

రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ లో మెదక్ జిల్లాకు ప్రథమ స్థానం కైవసం

ఆర్తి చంద్రను అభినందించిన కలెక్టర్ ప్రతిమాసింగ్



ముద్ర ప్రతినిధి, మెదక్: రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ లో మెదక్ జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. సోమవారం రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆర్తి చంద్రను కలెక్టర్ ప్రతిమా సింగ్ సత్కరించారు.కలెక్టర్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో 33 జిల్లాల నుండి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ గామెదక్ జిల్లా శంకరంపేట(ఆర్) తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆర్తి చంద్రప్రతిభ కనబరచడం అభినందనీయం అన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంటులో ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై అద్భుత ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానాన్ని దక్కించుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పదవ తరగతిలో రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకు సాధించాలని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్తి చంద్రకు గైడ్ టీచర్ గా వ్యవహరించిన లింగమయ్య పిజిటిని, పాఠశాల ప్రిన్సిపాల్, సహకరించిన సోషల్ ఫోరం బాధ్యులు నర్సింలు, రవిబాబులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం

ముద్ర ప్రతినిధి, మెదక్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారుల స్వీకరించిన ఎస్పీ ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, ఆయా సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.



బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలు


ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



ముద్ర ప్రతినిధి, మెదక్: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఆమె సోదరుడిపై రాయితో దాడి చేసిన కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. 2024 నవంబర్ లో 16 సంవత్సరాల బాలిక ఐకేపీ సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా మధు ఆమె చేయి పట్టుకుని లాగి, తనను ప్రేమించాలని చెబుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆమెను వదిలిపెట్టాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె సోదరుడు మధును ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన మధు రాయితో అతడి తలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంకరంపేట ఆర్ ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించారు. విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగారా శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎస్సై నారాయణ, పీపీ బాలయ్య, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ బి. విఠల్, కానిస్టేబుల్ జి. కృష్ణ గౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీధర్‌లను ఎస్పీ అభినందించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి టీడీపీ మద్దతు

దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన జాతీయ అధికార ప్రతినిధి జ్యోష్ణ



ముద్ర, నారాయణపేట: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. నారాయణపేట జిల్లాలోని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోష్ణ సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, న్యాయమైన డిమాండ్ల సాధనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఉద్యోగుల పోరాటం కేవలం వేతనాల పెంపు కోసం మాత్రమే కాదని, ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం, కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై కాలపరిమితితో కూడిన పరిష్కారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు విధానంలో నియామకమైనప్పటికీ ప్రజలకు అందిస్తున్న సేవల విలువను గుర్తించి ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట టీడీపీ నాయకులు రాఘవరావు చౌదరి, ఓం ప్రకాశ్, గణప ప్రసాద్, శ్రీనివాస్, మొగులప్ప, అనంతరెడ్డి, యాబన్న చౌదరి, వీరన్న గౌడ్, పెంటప్ప తదితరులు పాల్గొని ఉద్యోగులకు మద్దతు తెలిపారు.అనంతరం నారాయణపేటకు విచ్చేసిన జ్యోష్ణను స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు.

మరథాన్‌లో పతకం సాధించి..

కుప్పకూలి మృతి చెందిన టెక్కీ

పరుగు పూర్తి చేసిన కొద్దిసేపటికే గుండెపోటు..
మూడేళ్ల కుమార్తెకు తండ్రిని దూరం చేసిన విషాదం



ముద్ర, హైదరాబాద్: మరథాన్‌లో ఉత్సాహంగా పాల్గొని పరుగు పూర్తి చేసి పతకం సాధించిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొద్దిసేపటికే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. మణికొండ అల్కాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న కొమ్మినేని గోపి (36) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో ఎన్ఈబీ సంస్థ నిర్వహించిన మరథాన్‌లో పాల్గొన్నాడు. విజయవంతంగా పరుగు పూర్తి చేసి పతకం కూడా అందుకున్నాడు. అనంతరం టిఫిన్ చేసేందుకు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.దీంతో నిర్వాహకులు వెంటనే స్పందించి గోపిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు కారణంగా గోపి మరణించినట్లు పోలీసులు తెలిపారు.గోపికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. మరథాన్‌లో పతకం సాధించిన ఆనందం కొద్దిసేపటికే విషాదంగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మెదక్ విద్యార్థులకు పతకాలు



ముద్ర ప్రతినిధి, మెదక్: హైదరాబాద్ గోషామహల్ చంద్రశేఖర్ ఆజాద్ ఇండోర్ స్టేడియంలో కరాటే బుడోకాన్ ఫెడరేషన్ నిర్వహించిన కరాటే టోర్నమెంట్ లో శేఖర్ బుడోకాన్ కరాటే అండ్ యోగి అకాడమీ మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థులు పథకాల పంట పండించారు. కటాస్ విభాగంలో శ్రీ హర్షిని, క్షితిజరామ్ ఒరిస్సాల్లో జరగబోయే నేషనల్ టోర్నమెంట్ కి ఎంపికయ్యారు. కటాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. స్పారింగ్ విభాగంలో బ్రౌన్ మెడల్స్ సాధించారు. సాయి మాధవ్ –సిల్వర్ బ్రౌన్ మెడల్స్, విద్యాధర్ – బ్రౌన్, సాయి కారుణ్య – బ్రోన్జ్, ప్రఖ్యాత్ గౌడ్ – సిల్వర్, అభిజ్ఞ – బ్రౌన్, యశ్వంత్ j సిల్వర్ అండ్ బ్రౌన్, ఆధ్యాత్ –సిల్వర్ అండ్ బ్రౌన్, టీఎన్ సుదీప్ – బ్రౌన్, శ్రీహిత సాయి సంజయ్, సాయిఅబ్జిత్ కన్సోలేషన్ మెడల్స్ సాధించారు. వీరికి మెంటర్స్ గా బి.చంద్రశేఖర్, ఎన్ .గణేష్ వ్యవహరించారు. శేఖర్ బుడోకాన్ కరాటే అండ్ యోగి అకాడమీ ప్రెసిడెంట్ సుభాష్, జనరల్ సెక్రెటరీ యాదగిరి కోచ్ లుగా వ్యవహరించారు. వ్యవస్థాపకులు కరాటే శేఖర్ అభినందించారు.

ఉచిత మెహందీ డిజైనింగ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ మిల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఉచిత మెహందీ డిజైనింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. బాధ్యులు డాక్టర్ ఒమర్ ఖాన్, ముఫ్తీ మహమ్మద్ సాబిర్ అలీ, సయ్యద్ సాదత్ అలీ జకీ, సయ్యద్ గఫార్ అహ్మద్ నియాజీ, మహమ్మద్ రియాజుద్దీన్ జర్నలిస్ట్, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ సద్దాం, మహమ్మద్ అబ్దుల్ రవూఫ్, సిద్ధిఖ్ మొహియుద్దీన్, మహమ్మద్ అఫ్సే, సానియా, సమీరా మాట్లాడుతూ మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అత్యాధునిక సాంకేతిక పరికరాలతో భూ రీ సర్వే



ముద్ర ప్రతినిధి, మెదక్: అత్యాధునిక సాంకేతిక పరికరాలతో భూ రీ సర్వే చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ భూ రీ సర్వే పరికరాలను భూ సర్వే ఏడి కిషన్, సంబంధిత శాఖ ఉద్యోగులకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూ రీ సర్వేలో ఖచ్చితత్వాన్ని అమలు చేయడానికి, పకడ్బందీగా సర్వే నిర్వహించడానికి, సమయ భావాన్ని తగ్గించి, పారదర్శకమైన భూ సర్వే కోసం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉపయోగపడతాయన్నారు.

భరత్ నగర్ కాలనీ సమస్యలపై వినతిపత్రం



ముద్ర, కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీలో నిర్వహించిన "వన్ వార్డు – వన్ డే" కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలు, అభివృద్ధి పనుల వివరాలను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నివాసితులను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో ఇప్పటివరకు పరిష్కారం కాని పాత హామీలు, ప్రస్తుతం ఎదురవుతున్న పౌర సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కాలనీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు నాగేశ్వర్ రావు, సలహాదారులు రత్నా రావు, వెంకటేశ్వర్లు, మూర్తి, బాబు, నరేష్, వెంకటేష్ యాదవ్, బుచ్చిబాబు, డేవిడ్, రాంబాబు, కృష్ణ, వేణుగోపాల్, రాజు, అమృత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

200 మీటర్ల రోడ్డు పనులకు నెల రోజులా?

నిలిచిన పనులతో ప్రజలు, వ్యాపారుల తీవ్ర అవస్థలు



ముద్ర, కూకట్‌పల్లి: కాలనీలోని పోచమ్మ దేవాలయం నుంచి ఆదిత్య బేకరీ వరకు సుమారు 200 మీటర్ల మేర చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు నెల రోజులు గడుస్తున్నా పూర్తి కాకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి రోడ్డు పనులను సైతం 30 రోజుల్లో పూర్తి చేయలేక పోవడం అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు.అసంపూర్తిగా ఉన్న రోడ్డు వల్ల వాహనదారులు, బాటసారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై రాకపోకలు నిలిచిపోవడంతో స్థానిక దుకాణాల వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వినియోగదారులు రాక చిరు వ్యాపారులు షాపుల అద్దెలు, పనిచేసే సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు సైతం ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారు.కేవలం 200 మీటర్ల రోడ్డు పనులను పూర్తి చేయడానికి ఎంతకాలం పడుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని భరత్ నగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555